
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 2 సెప్టెంబరు 2025 | 5





నీటి'దారి'..

జిల్లాలోని గోదావరి తీర ప్రాంతాల్లో వరద ముంపు ఇంకా వీడలేదు. లంక గ్రామాలను కలుపుతూ ఉన్న రోడ్లు మునకలోనే ఉండడంతో రాకపోకలకు జనం అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముమ్మిడివరం మండలం గురజాపులంకలో సిమెంటు రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు ఇలా...

- ముమ్మిడివరం

బలహీనవర్గాల జీవనోపాధికి తోడ్పాటు సామాజిక పింఛన్లు : కలెక్టర్



అమలాపురంలో దివ్యాంగురాలికి రూ.6 వేల పింఛను అందిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు బలహీనవర్గాల జీవనోపాధికి తోడ్పడి ఆర్థిక భద్రతతో గౌరవం కలిగించే సంక్షేమ పథకమని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిధిలోని కొంకాపల్లి గ్రామంలో పేదల సేవలో భాగంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా కన్నెపాముల శాంతి అనే దివ్యాంగురాలికి రూ.6వేల దివ్యాంగ పింఛను ఇంటి వద్దనే అందించారు. అదేవిధంగా కొల్లు చంద్రకాంతం అనే మహిళకు ఇంటి వద్దనే వృద్ధాప్య పింఛన్ రూ.4 వేలు అందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం నుంచి పింఛన్ల పంపిణీ పండుగ వాతావరణంలో జరుగుతుండడంతో అవ్వాతాతల కళ్లల్లో ఆనందం వ్యక్తమవుతోందని, ఎన్టీఆర్ భరోసా భద్రతా పింఛన్ అనేది రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక ప్రతిష్ఠాత్మక సంక్షేమ పథకమని, దీన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకుని సమాజంలో గౌరవప్రదమైన జీవనాన్ని గడపాలన్నారు. ఇందులో భాగంగా వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కులవృత్తిదారులు, చేనేత, మత్స్యకార, బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతినెల పింఛను రూపంలో ఇచ్చే ఆర్థిక సాయం వల్ల బలహీనవర్గాలకు కనీస జీవన భద్రత లభిస్తుందన్నారు. ఒంటరి మహిళలు, భర్త నుంచి విడాకులు పొందిన మహిళలకు జీవనోపాధికి ఆసరాగా నిలుస్తుందన్నారు. వృద్ధులకు కనీస మందులు, చికిత్సల కోసం ఉపయోగపడుతుందన్నారు. ఆత్మగౌరవంతో కుటుంబంపై పూర్తిగా ఆధారపడకుండా వృద్ధులు తాము స్వయంగా కొంతవరకూ ఖర్చులు నిర్వహించగలరన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పింఛన్లు పేదల కొనుగోలు శక్తిని పెంచుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాయినాథ్, జైచంద్ర గాంధీ, తహశీల్దారు అశోక్, స్థానిక వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆలమూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ దాడి

రూ.28 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన సబ్‌రిజిస్ట్రార్ సరోజినీకుమారి, కారు డ్రైవర్

7

6 నుంచి క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ కార్డుల పంపిణీ

జిల్లా రెవెన్యూ అధికారి మాధవి



అమలాపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రేషన్ అక్రమాలకు చెక్ పెట్టేందుకు క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్‌కార్డులను రూపొందించిందని జిల్లా రెవెన్యూ అధికారి కె.మాధవి తెలిపారు. స్మార్ట్ కార్డులను ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈ నెల 6 నుంచి పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం మాధవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలన అందించే దిశగా కీప్ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ అన్నింటినీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించిందని, ఆ దిశగా ప్రతీశాఖ తమ కార్యాలయాల రికార్డులను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రతీ శాఖకు ప్రత్యేక లాగిన్ ఇవ్వడం జరిగిందన్నారు. క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్‌కార్డుల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సరోగసీ యాక్టు పటిష్టంగా అమలు : డీఎంహెచ్‌వో

అమలాపురం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ఏఆర్‌టీ సరోగసీ పీసీఅండ్‌పీఎన్‌టీడీ యాక్టును పటిష్టంగా అమలుచేయాలని, అనుమతి లేకుండా పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో ఎం.దుర్గారావు దొర ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఈ యాక్టును పటిష్టంగా అమలుచేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. నిబంధనలు పాటించని జిల్లాలోని ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్లు జరిమానా, జైలుశిక్షకు గురవుతారని, ఎవరైనా సరే చట్టం ప్రకారం శిక్షార్హులని డీఎంహెచ్‌వో దుర్గారావు స్పష్టంచేశారు.

అక్రమాలపై చర్యలేవీ?



ద్వారపూడిలో నిర్మించిన సుబ్రహ్మణ్యేశ్వర దుకాణ సముదాయం ఇదే.. (ఫైన) దుకాణ సముదాయం గోడలకు అల్లుకున్న తీగలు

- ద్వారపూడి పంచాయతీలో షాపింగ్ కాంప్లెక్స్ పేరుతో స్వాహా
- స్వయంగా ఎమ్మెల్యే ఫిర్యాదుతో బాగోతం బట్టబయలు
- నిబంధనలు తుంగలో తొక్కి 39 షాపుల నిర్మాణం
- రూ.80 లక్షల మేర పక్కదారి.. విచారణలోనూ నిర్ధారణ
- పాలకవర్గం, కార్యదర్శులపై ఇప్పటికీ చర్యలు నిల్

(ఆంధ్రజ్యోతి- మండపేట)

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పేరుతో చేసిన వసూళ్లు పక్కదారి పట్టాయి. అధికారుల విచారణలో ఇది బట్టబయలు అయినా సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవడంతో ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. మండపేట నియోజకవర్గంలోని ద్వారపూడిలో పంచాయతీకి చెందిన స్థలంలో 2022లో 39 దుకాణాలను నిర్మించేందుకు ప్రతిపాదించారు. ఎవరికైతే దుకాణం కావాలో వారి వద్ద నుంచి షాపు నిర్మాణం కోసం రూ.4.5 లక్షలు, పంచాయతీ వద్ద లబ్ధిదారుడి వాటాగా రూ1.5 లక్షల వంతున డిపాజిట్‌ను అప్పటి పంచాయతీ పాలకవర్గం వసూలుచేయాలని నిర్ణయించింది. రూ.4.5 లక్షలకు సంబంధించి సర్పంచ్ వసూలుచేసి రశీదు ఇవ్వగా, డిపాజిట్‌గా వసూలు చేసిన రూ.లక్ష 50 వేలకు పంచాయతీ రశీదును ఇచ్చారు. ఈ దుకాణ సముదాయాన్ని 2022లో ప్రారంభించి 2024 ఎన్నికల ముందు ప్రారంభించారు. అయితే ఇప్పటిదాకా లబ్ధిదారులకు మాత్రం దుకాణాల కేటాయింపు జరగలేదు. నగదు చెల్లించిన లబ్ధిదారులు పంచాయతీ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకున్న వారే లేరు. వాస్తవానికి ఈ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి పంచాయతీ పాలకవర్గం 2022లో ప్రైవేటు ఏజన్సీ ద్వారా డిజైన్ వేయించి ఆ పనులను పంచాయతీ పాలకవర్గానికి చెందిన ఒక నాయకుడే చేపట్టారు. వాస్తవానికి పంచాయతీ తీర్మానం బైలా ప్రకారం పంచాయతీ రూ.5 లక్షలకు మించి పనులు చేపట్టే అధికారం లేదు. ఇక్కడ అవేమీ పట్టించుకోలేదు. 39 దుకాణాలకు సంబంధించి లబ్ధిదారుడు ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.6 లక్షల వంతున వసూలు చేయాల్సి ఉండగా, వీరిలో తొమ్మిది మందికి మాత్రం గ్రామంలో నిర్మించిన ఫ్లయ్‌ఓవర్ నిర్మించే సమయంలో దుకాణాలు కోల్పోయినందుకు దుకాణాలు కేటాయించారు. వారి వద్ద నుంచి కూడా రూ.4.5 లక్షల చొప్పున వసూలు చేశారు. వారికి రూ.లక్షన్నర డిపాజిట్ నుంచి మినహాయింపు ఇచ్చారు. మిగిలిన వారి నుంచి నిబంధనలు మించి రూ.6 లక్షల వంతున సొమ్ములు వసూలు చేశారు. కానీ ఒక్కొక్క షాపునకు అంచనా వ్యయం రూ.2.50 లక్షలుగా పంచాయతీ రాజ్‌శాఖ వేయగా, దాన్ని రూ.4.5 లక్షల మేర పెంచి చూపించినట్టు అధికారుల విచారణలో తేలింది. అంటే రూ.78 లక్షల మేర అదనపు వసూళ్లకు పాల్పడినట్టు తెలిసింది. దీనికి పాలకవర్గంతోపాటు అప్పట్లో ఇక్కడ పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు సహకరించి అవినీతిలో భాగస్వాములయ్యారని విచారణలో వెల్లడైంది. నిర్మాణ పనులకు టెక్నికల్ అనుమతులు లేకుండా, ఎటువంటి టెండరు పిలవకుండానే పనులు చేసేయడం విశేషం. ఈ అవినీతి వ్యవహారం విచారణలో వెల్లడవడంతో తాత్కాలికంగా సర్పంచ్ చెక్‌పవర్ రద్దును ఇటీవల ప్రభుత్వం రద్దుచేసింది. దుకాణాల కేటాయింపు కూడా స్థానికులకు కాకుండా స్థానికేతరులకు కేటాయించినట్టు వెల్లడైంది. ఇక 39 దుకాణాలకు సంబంధించి 9 మందిని మినహాయించి మిగిలిన 30 మంది వద్ద నుంచి రూ.1.50 లక్షల వంతున డిపాజిట్‌ను పంచాయతీ వసూలు చేయగా, అందులో కూడా నిధులు దుర్వినియోగం జరిగిందని తేలింది. ఇక షాపుల కేటాయింపులో ఎస్సీలకు ఆరు, ఎస్టీలకు మూడు కేటాయించాల్సి ఉండగా, ఎస్సీలకు ఒకటి కేటాయించారు. ఎస్టీలకు ఒక్కటి కూడా ఇవ్వలేదు. ఇప్పటికే ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఫిర్యాదు మేరకు జిల్లా పంచాయతీ అధికారి నేతృత్వంలో వరుస విచారణలు చేసి నిధులు దుర్వినియోగం జరిగాయని పంచాయతీ కార్యదర్శులు, పాలకవర్గంపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు విచారణ నివేదికను పంపారు. ఇక ఈ దుకాణాల సముదాయం వ్యవహారం ఎటూ తేలకపోవడంతో అధికారులు 30 దుకాణాలకు తాళాలు వేశారు. విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో కరెంట్ కూడా కట్ చేశారు. ఈ వ్యవహారం ఎప్పటికి కొలిక్కి వస్తుందో వేచి చూడాల్సి ఉంది. దీనిపై జిల్లా పంచాయతీ అధికారి శాంతలక్ష్మిని వివరణ కోరగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఫిర్యాదు మేరకు విచారణ చేశామని, కార్యదర్శులు, పాలకవర్గంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్రపంచాయతీరాజ్ కమిషనర్‌కు నివేదిక పంపించడం జరిగిందని ఆమె చెప్పారు.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు

రెండేళ్లలో పోలవరం

- ప్రాజెక్టుకు రూ.15 వేల కోట్లిచ్చాం
- బీజేపీ పటిష్టానికి చర్యలు
- త్వరలో మన పార్టీ - మన జెండా
- కుంభమేళా తరహాలో పుష్కరాలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, వచ్చే రెండేళ్లలో పోలవరం ఎడమకాలువ ద్వారా నీళ్ల ప్రవహించేలా పనులు శరవేగంగా జరుగుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్.మాధవ్ అన్నారు.రాజమహేంద్రవరంలో సోమవారం చాయ్‌పే చర్చ, సారథ్యం యాత్ర, బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్రంలో బీజేపీని గ్రామ స్థాయిలో పటిష్టం చేయడానికి "మన పార్టీ మన జెండా" పేరుతో కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు. వైసీపీ హయాంలో పోలవరం పనులు నత్తనడకన జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోలవరంపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని, కేంద్రం ఇప్పటికే రూ.15 వేల కోట్లు ఇచ్చిందన్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఉత్తరాంధ్ర, రాయలసీమ వాసులకు సాగు, తాగునీటి ఇబ్బందులు తొలగుతాయన్నారు. కూటమిలో సముచిత స్థానం లభించడంలేదని కొంతమందిలో అసంతృప్తి ఉన్నమాట వాస్తవమే అయినా మూడు పార్టీలకు సమన్వాయం చేస్తూ పదవులు లభిస్తున్నాయనే సంగతి గుర్తుంచుకోవాలన్నారు. కుంభమేళా తరహాలో రాజమహేంద్రవరం పుష్కరాలను ఘనంగా నిర్వహించాలనే ఆలోచన జరుగుతున్నదన్నారు. రాజమహేంద్రవరం తనకు అత్యంత ఇష్టమైన ప్రాంతం అన్నారు. మహనీయుడు కందుకూరి వీరేశలింగం నడయాడిన రాజమహేంద్రవరం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాజకీయ క్షేత్రం అంటేనే బురదమయం అన్నారు. దేవుడి దర్శనానికి వెళ్లాలంటే డబ్బులు ఇవ్వాల్సి రావడం బాధగానే ఉందన్నారు. అయోధ్య రామాలయంలో దర్శనం, ప్రసాదాల విషయంలో ఆదర్శవంతమైన వ్యవస్థ నిర్మాణమైంది. అలాంటి వ్యవస్థ అన్ని చోట్లా జరగాలన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ బీజేపీ ప్రస్థానంలో కార్యకర్తల భాగస్వామ్యం ప్రధానమైందన్నారు. రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ అవినీతి, అరాచక పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఘనత బీజేపీ కార్యకర్తలకే దక్కుతుందన్నారు. మోదీ తల్లి గురించి రాహుల్‌గాంధీ మాట్లాడిన తీరు దారుణమని, సంస్కారం లేకుండా చేస్తున్న ఇలాంటి విమర్శలను తిప్పికొట్టాలన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశాన్ని అన్ని రంగాల్లో ప్రధాని మోదీ అభివృద్ధి చేస్తున్నారని..రాష్ట్రానికి అవసరమైన సహకారం అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ దిశ, దశ మార్చే శక్తియుక్తులు మాధవ్‌లో ఉన్నాయన్నారు. ముందుగా రాజమహేంద్రవరం వై.జంక్షన్ నుంచి దేవీచౌక్ మీదుగా సుబ్రహ్మణ్యమైదానం వరకూ పాదయాత్రగా ర్యాలీ చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు బొమ్ముల దత్తు, రేలంగి శ్రీదేవి, దయాకర్‌రెడ్డి, పరిమి రాధ, నర్సిపల్లి హారిక, కోడూరి లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 165 అర్జీలు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అందిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ జిల్లాస్థాయి అధికారులను ఆదేశించారు. నూరుశాతం ప్రజా సంతృప్తే కొలమానంగా నాణ్యతతో సమస్యలను పరిష్కరించాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను నేరుగా ఫిర్యాదు చేసుకునేందుకు వెబ్‌సైట్ అందుబాటులో ఉందన్నారు. 1100 నంబరుకు ఫోన్‌చేసి ప్రజల సమస్యలను చెప్పుకోవడంతోపాటు ఎప్పటికప్పుడు పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చన్నారు. గ్రామ సచివాలయాల్లో కూడా అర్జీలు స్వీకరించి ఫిర్యాదుదారునికి ఐడీ నంబరు అందజేస్తారన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి వద్ద నుంచి కలెక్టర్ మహేష్‌కుమార్‌తోపాటు జిల్లా రెవెన్యూ అధికారి కె.మాధవి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, సమగ్రశిక్ష ఏపీడీ జి.మమ్మీ మొత్తం 165 అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ పి.కృష్ణమూర్తి, డీఎల్‌డీవో రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో 24 అర్జీలు



అర్జీదారుని సమస్య వింటున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురంటౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను ఎస్పీ నేరుగా అడిగి తెలుసుకుని అర్జీలను స్వీకరించారు. కుటుంబ కలహాలు, భూ తగాదాలు, ఇతర సమస్యలపై 24 అర్జీలను ఎస్పీ స్వీకరించారు. వెంటనే సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో సమస్యలను విచారించి త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. అలాగే ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఎస్పీ కృష్ణారావు ఆదేశించారు.





రావులపాలెంలో సోమవారం స్త్రీ శక్తి విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారు, మహిళలు.. మహిళలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు, నాయకులు

చంద్రబాబు, పవన్ ఏ పథకం ప్రవేశపెట్టినా

సూపర్ హిట్టే..

- మహిళల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట
- స్త్రీశక్తి విజయోత్సవ సభలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం,సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్థిక పురోభివృద్ధి కల్పించడంతోపాటు వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లేందుకు కూటమి ప్రభుత్వం విశేష కృషిచేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం ఎదురుగా ఉన్న ఓ ఫంక్షన్ హాలులో సోమవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో భారీఎత్తున స్త్రీశక్తి విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఎం చంద్రబాబు తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి నేటికి 30 సంవత్సరాలు కావడంతో కేక్‌ను కట్ చేసి వేడుకలను జరిపారు. స్త్రీశక్తి పథకం అమలు సక్సెస్ అయిన సందర్భంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నాయకులు, మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే బండారు మాట్లాడారు. ఒక కుటుంబం ఉన్నత స్థితికి చేరిందంటే ఆ ఘనత మహిళలదేనన్నారు. సీఎం చంద్రబాబు సతీమణిగా భువనేశ్వరి భర్త కుమారుడు, ఎదుగుదలకు ఎంతగానో కృషిచేసిందన్నారు. ఆమె పెంచిన సత్ప్రవర్తనతోనే మంత్రి లోకేశ్ మహిళలకు ఎంతగానో గౌరవం ఇస్తారన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృష్ణార్జునుల వలే సంయుక్తంగా ప్రవేశపెట్టిన ఏ పథకమైనా సూపర్‌హిట్టేనన్నారు. సీఎం చంద్రబాబు మహిళాశక్తి ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టడం రాష్ట్రంలోని మహిళలకు వరంగా మారిందన్నారు. ఈ పథకం అమలు సమయంలో మాజీ ఎమ్మెల్యే బస్సు ఎక్కి ఉచిత బస్సు తుస్సు అంటూ సర్కస్ ఫీట్లు చేశారని ఆరోపించారు. ఈ పథకం సూపర్ హిట్ అవ్వడంతో వైసీపీకి చెంపపెట్టుగా మారిందన్నారు. కోనసీమ తిరుమల వాడపల్లి దేవస్థానానికి వెళ్లే బస్సులు కూడా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బటన్ నొక్కి ప్రచార ఆర్భాటమే తప్ప క్షేత్రస్థాయిలో ఆ పథకాల ప్రతిఫలం ప్రజలకు చేరిందేలేదన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో ప్రతి పథకాన్ని నిశితంగా పరిశీలించి అమలుచేయడం జరుగుతోందన్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కృషిచేసిన 22 మంది మహిళలను సత్కరించారు. విజయోత్సవ సభకు అనుకున్న దానికంటే పెద్దఎత్తున మహిళలు తరలిరావడంతో కొంతమంది మహిళలు బయటే ఉండి పోవాల్సి వచ్చింది. సభ అనంతరం ఎమ్మెల్యే బండారు వారి దగ్గరికి వచ్చి కృతజ్ఞతలు తెలిపారు. కొత్తపల్లి వెంకటలక్ష్మీదుర్గారావు, దండంగి మమత, యల్లమిల్లి చంద్రకుమారి, సర్పంచ్ నరాలశెట్టి సుబ్బలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీలు

రామచంద్రపురాన్ని కాకినాడ జిల్లాలో కలపాలి

కలెక్టర్‌కు తీర్మానాలు అందజేసిన ఎంపీపీలు

6



తీపి.. గణేశుడు





ధవళేశ్వరం బస్టాండ్ వద్ద 1500 కేజీల అనకాపల్లి బెల్లం కుందెలతో విశాఖపట్నంలో తయారు చేసిన 12 అడుగుల గణేశుడిని ప్రతిష్ఠించారు. ఈ విగ్రహాన్ని ధవళేశ్వరం తరలించడానికి సుమారు రూ.1.80 లక్షలు ఖర్చయినట్టు విఘ్నేశ్వర ఆటో యూనియన్ అధ్యక్షుడు అప్పన్న తెలిపారు. - ధవళేశ్వరం

ఐడియాకో దండం!

కోనసీమ అంటే కొబ్బరికి ప్రసిద్ధి.. కొబ్బరితో ఏమేం చేయవచ్చో కోనసీమవాసులకు తెలిసినంతగ మరికెవరికీ తెలియదు.. ఈ సంఘటనే ఉదాహరణ.. పువ్వుల ధరలు మండిపోతున్నాయి.. దండ కొనుగోలు చేయాలంటే రూ.200పైనే ఉంటుంది.. అందుకే అంతర్వేదికి చెందిన పున్నం నాగేంద్ర, చిక్కాల సాయి కొబ్బరి ఆకులతో దండలు చేసి వినాయకులకు వేశారు.. భలేగుంది కదూ ఐడియా.. - అంతర్వేది

మూషిక వాహన గణేశా!



అయినవిల్లి శ్రీ సిద్ధివినాయక స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి లక్ష దూర్వార్చన, ప్రత్యేకాలంకరణ, పంచ హారతులు నిర్వహించారు. చవితి మహోత్సవాల్లో ఆరో రోజు శక్తి గణపతి అలంకారుడై మూషిక వాహనంపై స్వామివారిని మాడవీధి సేవ నిర్వహించారు. - అయినవిల్లి



ఘన.. పయ్యి!

పి.గన్నవరంలో ఆటోపై మండపం కట్టి గణేశుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భారత్ ఆటో యూనియన్ సభ్యులు

కల్పవృక్షం.. కొబ్బరిచెట్టు



కొబ్బరి పేరు చెప్పగానే మనందరకీ గుర్తొచ్చేది కోనసీమ. ఎటుచూసినా పైరు పచ్చని వరి చేలు.. కల్పవృక్షాల్లాంటి కొబ్బరిచెట్లు.. వాటికి నలుదిక్కులా కొబ్బరి గెలలతో కొబ్బరి చెట్లు కనువిందు చేస్తాయి. సూర్యరశ్మిని సైతం నేల పైకి పడకుండా గొడుగు మాదిరిగా ఉంటూ సూర్యకిరణాలు కొద్దిగా నేలపై పడుతూ కనిపించే దృశ్యాలు కోకొల్లలు. కోనసీమ రైతుల బతుకు బండి కొబ్బరి పంటపైనే ఆధారపడి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఎకరాల్లో కొబ్బరి పంట సాగవుతుంటే అధిక భాగం కోనసీమలో విస్తరించి ఉండడంతో కోనసీమకు కొబ్బరిసీమ అని పేరు వినిపిస్తుంటుంది. కొబ్బరి చెట్ల అందాలను తమ కెమేరాల్లో బంధించేందుకు తహతహలాడుతున్నారు ఫొటోగ్రాఫర్లు, సినీ దర్శకులు. అందుకే చాలా సినిమాల్లో కోనసీమ కొబ్బరి అందాలు వర్ణిస్తూ ఎన్నో సినిమాలను కూడా చిత్రీకరించారు. ప్రపంచ కొబ్బరి దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

» రికార్డు స్థాయిలో కొబ్బరి ధరలు
» నేడు ప్రపంచ కొబ్బరి దినోత్సవం

కొబ్బరి దినోత్సవం ఇలా మొదలైంది..

అంబాజీపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రతిఏటా సెప్టెంబరు 2న ప్రపంచ కొబ్బరి దినోత్సవం జరుపుకోవడం పరిపాటిగా మారింది. ప్రపంచంలో కొబ్బరికాయల సాగులో మొదటిస్థానంలోఉన్న ఇండోనేషియా వ్యవస్థాపక దినోత్సవం ఇదేరోజున. ఆ దేశాన్ని గౌరవిస్తూ కోకోనట్ డేను ఈరోజు నిర్వహిస్తుంటారు. మనదేశానికి కూడా ఆ సంఘంలో సభ్యత్వం కావడం.. మనకూ కొబ్బరి మీదే ఓ రాష్ట్రం ఉండడం.. మనరాష్ట్రంలో కోనసీమంతా కొబ్బరి పరిమళాన్ని వెదజల్లడంతో ఆ దినోత్సవం ఇక్కడా ప్రత్యేకమైపోయింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కొబ్బరిసాగు రైతుల సమక్షంలో కొబ్బరికాయల వాడకం ప్రాముఖ్యంపై ప్రజలకు తెలియచేయడం, కృత్రిమ శీతల పానీయాల కంటే కొన్ని రెట్లు మెరుగైన సహజసిద్ధమైన కొబ్బరినీళ్ల తాగడంలో ప్రయోజనాలు వివరించడం, కొబ్బరి పరిశ్రమలో పెట్టుబడులను ప్రోత్సహించడం వంటివి కోకోనట్ డే ప్రధాన లక్ష్యం.

కోనసీమ కొబ్బరి..

తెలుగువారికి కొబ్బరిఅనగానే కోనసీమ గుర్తుకు వస్తుంది. ఉభయగోదావరి జిల్లాలు విరివిగా కొబ్బరిపండిస్తే తూర్పుగోదావరి జిల్లానే మొత్తం రాష్ట్ర పంటలో సగం వరకూ ఉంది. అందులోనూ ఎక్కువ వాటా కోనసీమదే.నేల నాణ్యత, అధికతేమ, వర్షపాతం వంటి అంశాలు కోనసీమలో కొబ్బరిసాగుకు ఎంతగానో తోడ్పడతాయి. ఇక్కడి కొబ్బరి రైతులు కొబ్బరి చెట్లతో అవినాభావ సంబంధం కలిగి ఉంటారు. వాటిని తమ కుటుంబసభ్యుల్లా చూసుకుంటారు. నిజానికి ఒక కొబ్బరి చెట్టు కొడుకుతో సమానమని చెప్పుకొంటారు. అంటే ఒక కొబ్బరిచెట్టు ఉంటే కుటుంబాన్ని సునాయాసంగా వెళ్లదీయవచ్చునని భావం. ఇప్పుడు ఉభయగోదావరి జిల్లాల్లో కొబ్బరి సాగు తగ్గుతోంది. ప్రభుత్వపరంగా సరైన ప్రోత్సాహం లేక రైతులు నిరుత్సాహపడుతున్నారు. ఎకరానికి 10వేల కాయలు కాయించే కోనసీమ కొబ్బరి పంటను ఆధారం చేసుకుని విశేష నైపుణ్యాలు అభివృద్ధిఅయ్యాయి. కొబ్బరిచెట్లు ఎక్కేవాళ్లు, కాయలను ఒలిచే వాళ్లవంటి ప్రత్యేకమైన పని వాళ్లు ఇప్పుడు తగ్గుముఖం పడుతున్నారు.



కోనసీమదే అగ్రభాగం

కొబ్బరి పండించే దక్షిణాది రాష్ట్రాల్లో కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లు ముఖ్యమైనవి. వీటిలో ఆంధ్రప్రదేశ్ విషయానికి వచ్చేసరికి కోనసీమలోని అంబాజీపేటదే అగ్రభాగం. కేరళ అలెప్పి తర్వాత అంబాజీపేటదే అగ్రస్థానం. 1.25లక్షల హెక్టార్లలో కొబ్బరి పంట ఇక్కడ సాగవుతోంది. ప్రభుత్వ ఉద్యోగుల నెల జీతం మాదిరిగా కొబ్బరి రైతులకు ఆదాయం సమకూరుతుంది. అందుకే ఈ పంట అంటే ఇక్కడి రైతులకు అమితమైన అభిమానం. జీవిత చరమాంకంలో ఉన్న వారు కన్న కొడుకు కంటే కొబ్బరి చెట్టునే ఎక్కువ ప్రేమిస్తాడు.. ఆరాధిస్తాడు.

కొబ్బరి చెట్టుకు ప్రత్యేక స్థానం

కొబ్బరిచెట్టు నిజంగానే కల్పవృక్ష సమానం. మన జీవనంలో కొబ్బరిచెట్టుకు ఓ ప్రత్యేకమైన స్థానం ఉంది. పచ్చికొబ్బరి నుంచి ఎండు కొబ్బరి వరకూ అనేక రకాలుగా కొబ్బరిని వంటల్లో వాడడం, కొబ్బరినూనె, కొబ్బరినీరు దివ్య ఔషధాలుగా వాడుతుంటారు. కొబ్బరి పీచుతో కార్పెట్లు, క్వాయర్ పరుపులు, తాళ్లు తయారు చేస్తారు. కొబ్బరి మట్టలు, వంట చెరకుగా ఉపయోగిస్తారు. కొబ్బరి ఆకు ఈనెలతో చీపుర్లు తయారు చేస్తారు. ఇటీవల పచ్చని కొబ్బరి ఆకులతో వివిధ రకాల ఆకృతులను తయారు చేసి వాటిని పెళ్లి మండపాలు, పందిర్లలను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు.

ఎన్నడూ లేని విధంగా ధరలు

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది కొబ్బరి ధరలు పుంజుకున్నాయి. పచ్చికాయల ధరలకు రెక్కలు రావడంతో రైతులు ఉత్సాహంగా ఉన్నారు. ప్రస్తుతం పచ్చికొబ్బరికాయల ధరలు రూ.22వేల పైబడి కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది రూ.10వేలనుంచి అమాంతంగా రూ.22వేలకుపైబడి ధరలు పెరగడంతో రైతులు కొబ్బరితోటల వైపు దృష్టిసారించారు.

కొబ్బరి వల్ల ఉపయోగాలు

- కొబ్బరి గుజ్జులో 46శాతం తేమ, 37శాతం కొవ్వు, మిగతా శాతం లవణాలు, ప్రొటీన్లు, ఉంటాయి.
- కొబ్బరి ప్రొటీన్లలో అధికశాతం అమినోయాసిడ్లు ఉన్నాయి.
- ఎండు కొబ్బరి నుంచి తీసిన కొబ్బరి నూనెలోని కీటోన్, లాక్టోన్ ఆల్కాహాల్ వల్ల ఆ నూనెకు ప్రత్యేక వాసన వస్తుంది.
- ఆరోగ్యపరంగా నట్స్‌తో పోలిస్తే కొబ్బరిలో సంతృప్తికరమైన కొవ్వులు ఎక్కువ. అందులో ఆరోగ్యానికి మేలుచేసే లారిక్ ఆమ్లం చాలా ఎక్కువ. ఇది మోనోలారిన్ మారి అంటువాధ్యులు రాకుండా అడ్డుకుటుంది.
- లాక్టోజ్ పడని చిన్నారులు, గర్భిణులకు కొబ్బరినీళ్లు, కొబ్బరిని రుబ్బి తీసిన పాలను తీసి ఇస్తే గ్లూకోజ్‌లా పనిచేస్తుంది.
- కొబ్బరి నీరు శరీరాన్ని చల్లబరచడమే కాకుండా జీర్ణక్రియకు సంబంధించి సమస్యలను నివారిస్తుంది. అతిసార వ్యాధి బాధితులు ఆ సమస్యల నుంచి బయటపడేందుకు కొబ్బరి నీటిని తీసుకొంటే మంచిదని వైద్యులు చెప్తున్నారు.
- మూత్ర పిండాలు, మూత్ర నాళాల్లో ఏర్పడే రాళ్లను కరిగించే గుణం కొబ్బరినీట్లో ఉంది.
- మామూలుగా కొబ్బరినూనె ఎండబెట్టిన కొబ్బరి నుంచి తీస్తారు. పచ్చికొబ్బరి నుంచి నూనె తీయవచ్చు.

రూ.లక్ష దాటి పరుగులు!

» 10గ్రాముల 24క్యారెట్ ధర రూ.1,05,870
» ప్రస్తుతం 10 గ్రాముల 22 క్యారెట్ ధర రూ. 97,050

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బంగారంధరలు పైపైకి ఎగసిపోతున్నాయి. గతనెల వరలక్ష్మీవ్రతం రోజున బంగారం ధర భారీగా పెరిగిందనుకుంటే, ఇవాళ ఆ రికార్డులు బద్దలు కొట్టి, మరింత గా ధరలు పెరిగాయి. ఇప్పటికే బంగారం కొనుగోలు చేసినవారికి అది మంచి పెట్టు బడి వస్తువుగావారింది. సామాన్యులు మాత్రం నిరాశకు గురవుతున్నారు.



సోమవారం రికార్డుస్థాయిలో బంగారం ధరలు పెరిగాయి. శని, ఆదివారాల్లో రాజమండ్రి మార్కెట్‌లో 22క్యారెట్ 10గ్రాముల బంగారం ధర రూ.96వేల 200గా ఉంది. సోమవారం ఈ ధర రూ.97,050కు చేరింది. ఏకంగా ఒక్కరోజులో రూ.850 పెరిగింది. ఇంకా రూ.3వేలు పెరిగితే రూ.లక్ష అయిపోతుంది. ఇక 24 క్యారెట్ బంగారం 10గ్రాముల ధర లక్ష ఎప్పుడో దాటేసింది. ప్రస్తుతం లక్షా5వేల 870గా ఉంది. వెండి ధర కూడా లక్షకు పైగా దాటేసి పరుగులు తీస్తోంది. కిలో వెండి ధర రూ.లక్షా 26వేల300గా ఉంది.

రామచంద్రపురం నియోజకవర్గాన్ని

కాకినాడ జిల్లాలో కలపాలి

● కాకినాడ జిల్లా జేసీకి వినతి పత్రం అందజేసిన ఎంపీపీలు, సర్పంచ్‌లు



రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడజిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గాన్ని అతి దగ్గరలోఉన్న కాకినాడజిల్లాలో కలపాలని ఆ నియోజకవర్గానికి చెందిన ఎంపీపీలు, సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకినాడ కలెక్టరేట్లో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ భౌగోళికంగా పరిశీలిస్తే రామచంద్రపురం నియోజకవర్గం కాకినాడజిల్లాకు అతి సమీపంలో ఉందన్నారు. ఈ నియోజకవర్గంలో ఉన్న కాజులూరు మండలాన్ని కాకినాడజిల్లాలో విలీనమైందన్నారు. ఈనేపథ్యంలో మిగిలిన రామచంద్రపురం, కె.గంగవరం మండలాలను కాకినాడజిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రామచంద్రపురానికి అతిదూరంలో ఉన్న కోనసీమజిల్లాలో దీన్ని కలపడంవలన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి చిన్నపనికి అమలాపురం వెళ్లడం ప్రజలకు కష్టంగా ఉందన్నారు. ఈనేపథ్యంలో ప్రజల అభీష్టంమేరకు రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడజిల్లాలో విలీనం చేయాలని కోరారు. కాకినాడ కలెక్టరేట్లో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాకు వినతిపత్రం అందజేశారు.

కోనసీమ కలెక్టర్‌ను కలిసిన ఎంపీపీలు, కౌన్సిలర్లు

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని సోమవారం రామచంద్రపురం, కె.గంగవరం మండలాలకు చెందిన ఎంపీపీలు, రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిలర్లు అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు ఇప్పటికే కాకినాడ జిల్లాలో ఉందని, రామచంద్రపురం రూరల్, అర్బన్, కె.గంగవరం మండలాలు గోదావరికి ఇవతల ఉన్నందున, భౌగోళికంగా దూరంగా మారినందున రామచంద్రపురం రూరల్, అర్బన్, కె.గంగవరం మండలాలతో కలిసి మొత్తంగా నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని పేర్కొన్నారు. రామచంద్రపురం పురపాలక సంఘం చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ఏకగ్రీవంగా మద్దతు పలుకుతూ సంతకాలుచేసిన పత్రాలు కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, రామచంద్రపురం రూరల్ ఎంపీపీ అంబటి భవాని, గంగవరం ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్‌లు అనిశెట్టి రామకృష్ణ, యల్లమిల్లి సతీష్‌కుమారి, కట్టా గోవిందు, శ్రీను, బాలసుబ్రహ్మణ్యం, సత్యానందం, సూరిబాబు, శ్రీనివాస్, రాంబాబు, గోపాలకృష్ణ, వెంకట్రావు, దొరబాబు, బీఎస్పీ కాకినాడజిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయుల నియామకానికి చర్యలు

● ప్రభుత్వ సలహాదారు షరీఫ్



ప్రభుత్వ సలహాదారు ఎంఎ షరీఫ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం/సిటీ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఉర్దూభాషలో బోధన అందించడానికి ఉపాధ్యాయులను నియమించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామని ప్రభుత్వ సలహాదారు(మైనార్టీ వ్యవహారాలు) ఎంఎ.షరీఫ్ పేర్కొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా కొంతమూరు సమీపంలోని ప్రాథమిక, జడ్పీఉన్నత పాఠశాల, లక్ష్మీ వారపుపేటలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఉర్దూ విద్యాభివృద్ధికి తొలి నుంచీ సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 12 ఉర్దూ ఆశ్రమ పాఠశాలలు ప్రారంభించామన్నారు. పరిస్థితులకు అనుగుణంగా ఇంగ్లీషు మీడియంలో బోధనను అందుబాటులోకి తెచ్చి ప్రాథమికస్థాయి నుంచి జూనియర్ కళాశాల వరకూ ఉర్దూ నేర్చుకొనే విద్యార్థుల సంఖ్యను ఎక్కువ చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఒకటో తరగతిలో కనీసం 10మంది, పాఠశాలలో మొత్తం 40 మందికిపైగా విద్యార్థులు ఉన్నచోట ప్రత్యేక ఉర్దూ ఉపాధ్యాయుల నియామకం జరిగేలా చూస్తామన్నారు. ఇది ప్రభుత్వ పాలసీలో ఒక భాగమని చెప్పారు. ఉర్దూ విద్యార్థులను ప్రోత్సహించడంతోపాటు ప్రత్యేక గుర్తింపు ఇవ్వడం, మాతృభాషలో బోధన అందించే ఉపాధ్యాయుల నియామకం ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఒక భాగమని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభు త్వం కట్టుబడి ఉందన్నారు. ఉర్దూ బోధనా విష యంలో మైనార్టీల సమస్య తన దృష్టికి వచ్చిం దని, ప్రభుత్వ పాలసీ ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చ య్యచౌదరి మాట్లాడుతూ కొంతమూరు ప్రాం తంలో వేలాదిగా ముస్లిం కుటుంబాలు ఉన్నా యన్నారు. ఎలిమెంటరీ పాఠశాలలో 180 మం ది, హైస్కూల్‌లో 134 మంది విద్యార్థులు చదువుతున్నా ఉర్దూ లేకపోవడం సమస్యగా ఉందని చెప్పారు. సర్వశిక్ష అభియాన్‌ద్వారా ఉర్దూ ఉపాధ్యాయుల నియామకానికి చర్యలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమలలో డీఈవో వాసుదేవరావు, పిన్నమరెడ్డి ఈశ్వరుడు, మైనార్టీ నాయకులు షేక్ సుభాన్, రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, సొసైటీ చైర్మన్ అడ్డాల శ్రీను, డైరెక్టర్ యమన నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

ఏపీ ప్రధానోపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా చెవ్వూరి



చెవ్వూరి రవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కాకినాడరూరల్,సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కాకినాడ జిల్లాకు చెందిన చెవ్వూరి రవి ఎన్నికయ్యారు. విజయవాడలోని లయోలా కళాశాలవద్ద గల ఎస్‌జే సెంటర్లో నిర్వహించిన సంఘ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర ప్రధానోపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చెవ్వూరి అధ్యక్షుడిగానూ, గుంటూరు జిల్లాకు చెందిన గుత్తా శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శిగానూ, అనంతపురం జిల్లాకు చెందిన కేవీభాస్కర్ కోశాధికారిగానూ, కర్నూలుకు చెందిన ఓంకార్ యాదవ్ గౌరవాధ్యక్షుడిగానూ ఎన్నికకాగా అధ్యక్షుడిగా ఎన్నికైన చెవ్వూరి రవిని పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు ఎదుర్కొంటున్న కామన్ సీనియారిటీ సమస్య, క్లస్టర్ పాఠశాలలకు గ్రేడ్1 ప్రధానోపాధ్యాయుల నియామకం, ఆర్థిక సంబంధమైన సమస్యల సత్వరపరిష్కారానికి ప్రయత్నం చేస్తామని ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో సంఘ సభ్యులు, పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన జట్టు

జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీలకు జట్టు ఎంపిక

●13, 14 తేదీలలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

మండపేట, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో జరిగే టెన్నికాయిట్ పోటీలకు సంబంధించిన జట్టును ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు. మండపేట- ఏడిద రోడ్డులోవున్న వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ హైస్కూల్ ఉమ్మడిజిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఈ క్రీడా పోటీల ఎంపికకోసం 150మంది వరకు క్రీడాకారులు హాజరయ్యారు. వచ్చిన వారిలో 24 మందిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు. హెచ్‌ఎం ముంగర వెంకట్రాజు, విశ్రాంత ఉపాధ్యాయుడు గెడా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో టెన్నికాయిట్ పోటీలను మండపేటలో నిర్వహిస్తామన్నారు. ఈనెల 13,14 తేదీల్లో రెండు రోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు 200మంది క్రీడాకారులు హాజరవుతారని వారు చెప్పారు. ఈ పోటీలకు వచ్చే క్రీడాకారులకు అవసరమైన వసతులు కల్పిస్తామన్నారు. రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అప్పాని కృష్ణకుమారి మాట్లాడుతూ మండపేటలో జరిగే పోటీలకు క్రీడాభిమానులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు వైద్య పరీక్షలు

కాకినాడక్రైం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల కానిస్టేబుళ్లుగా ఎంపికైన 649 మంది అభ్యర్థులకు ఈనెల 2వ తేదీ నుంచి 8వరకు ఆరురోజులపాటు కాకినాడ జీజీహెచ్‌లో ఫిట్‌నెస్ రీత్యా వైద్య పరీక్షలు జరుగనున్నట్లు ఎస్పీ జి.బిందుమాధవ్ సోమవారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు విధిగా ఏఆర్, ఏపీఎస్పీ విభాగాల కేటగిరీలకు అనుగుణంగా, వారి రిజిస్ట్రేషన్ నెంబర్లను బట్టి ఆయా తేదీల్లో హాజరుకావాలని పేర్కొన్నారు. 2న రిజిస్ట్రేషన్ నెంబర్ 4003237 నుంచి 4126868 వరకు జరుగుతాయి. అలాగే 3వ తేదీన 4127974 నుంచి 4251533 వరకు, 4న 4254521 నుంచి 4493328 వరకు, 5న 4001955 నుంచి 4321734 వరకు, అలాగే 6వ తేదీన 4324322 నుంచి 4499757 వరకు, 7న రిజిస్ట్రేషన్ నెంబర్ 4106200 నుంచి 4247463 వరకు, సెప్టెంబరు 8న 4247699 నుంచి 4491931 వరకు ఈ వైద్య పరీక్షలు జరుగనున్నట్లు ఎస్పీ తెలిపారు. అభ్యర్థులు వారి వైద్య పరీక్ష తేదీకి ముందు తగిన విధంగా సిద్ధం కావాలన్నారు. సంబంధిత ఆరోగ్య పత్రాలు, అవసరమైన డాక్యుమెంట్లను తీసుకుని రావాలన్నారు.



స్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభం సందర్భంగా పూజలు చేస్తున్న అర్చకులు

ఘనంగా ప్రారంభమైన స్వామివారి పవిత్రోత్సవాలు

అంతర్వేది, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది పుణ్యక్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామివారి పవిత్రోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. భాద్రపద మాసంలో నవమినాటి రాత్రి నుంచి దశమి, ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. తొలిరోజు ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలకు పూజా కార్యక్రమాన్ని మంగళవాయిద్యాల నడుమ వైభవంగా ప్రారంభించారు. మొదటి రోజు అర్చకులు దీక్షారాధన చేసి మూలవరులకు ప్రత్యేక పూజలు చేశారు. తొలుత విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనంచేసి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం నవకలశారాధన, సప్త కలశారాధన, పవిత్రాలకు అర్చనలు, స్వామివారి పురాతన కల్యాణ మండపం వద్ద నిర్వహించి స్వామివారికి హారతి ఇచ్చారు. కార్యక్రమంలో చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజాకలిదిండి కుమారరామగోపాలరాజాబహదూర్, ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎస్వీ ప్రసాద్, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు పిఠాపురం క్రీడాకారుడి ఎంపిక



బుర్రి పీయూష్

పిఠాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు పిఠాపురం క్రీడాకారుడు ఎంపికయ్యాడు. పంజాబ్ రాష్ట్రం లూథియానాలో ఈనెల 2నుంచి 9వ తేదీ వరకూ జరిగే 75వ జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర బాలుర జట్టుకు పట్టణానికి బుర్రి పీయూష్‌ను ఎంపి క చేయగా, ఇప్పటికే బయలుదేరి వెళ్లాడు. పీయూష్‌ను జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, పిఠాపురం బాస్కెట్‌బాల్ ప్లేయర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథ్, బొజ్జా మాణిక్యాలరావు, కోశాధికారి కొత్తెం సుందరకుమార్, వీఎస్‌రెడ్డి, ఎం.రాజారావు, నంబోల అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

నాసిక్ నుంచి యానాం వరకు పాదయాత్ర

ఎటపాక, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గోదావరినదీ పుట్టిన నాసిక్(త్రయంబకం) ప్రాంతం నుంచి యానాం వరకు భక్తులు పాదయాత్ర చేపట్టారు. భక్తుల పాదయాత్ర సోమవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం నందిగామ గ్రామం వరకు చేరుకుంది. నాసిక్‌లోని గంగోత్రి ఆశ్రమంకు చెందిన భక్తులు గోదావరి నదీ ప్రాంతాల సందర్శన కోసం యాత్ర నిర్వహించారు. అయితే ఆగస్టు 3న నాసిక్ నుంచి భక్తులు పాదయాత్రగా బయలుదేరారు .అయితే వీరి పాదయాత్ర 3నెలల పాటు సాగనుంది. సుమారు పదిమంది భక్తులు రెండు గ్రూపులుగా విడిపోయి పాదయాత్రగా సాగుతున్నారు.



నాసిక్ నుంచి పాదయాత్ర చేస్తున్న భక్తులు

సత్యదేవుడి ఆదాయం రూ.1.69 కోట్లు

అన్నవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా రూ.1,69,06,902 నగదు, 39 గ్రాముల బంగారం, 765 గ్రాముల వెండి సమకూరాయి. వీటితోపాటు యూఎస్‌ఏకు చెందిన 170 డాలర్లు, యుఏఈ 455 దిరహమ్స్, సింగపూర్ 5 డాలర్లు, ఇంగ్లాండ్ 25 పౌండ్స్, పలుదేశాల కరెన్సీని భక్తులు హుండీల్లో వేశారు. లెక్కింపును ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించగా సిబ్బంది, సేవాసంస్థల సభ్యులు పాల్గొన్నారు. 32రోజులకు ఈ ఆదాయం సమకూరగా రోజుకు సరాసరిన రూ.5.28 లక్షలు భక్తులు కానుకల రూపంలో సమర్పించారు.


భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

నిలకడగా గోదావరి ప్రవాహం

- ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక
- 13.10 అడుగులకు చేరిన నీటి మట్టం
- ఎగువ ప్రాంతాల్లో గోదావరి తగ్గుముఖం


ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్ల వద్ద ప్రవహిస్తున్న వరద నీరు

ధవళేశ్వరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి నిలకడగా ప్రవహిస్తుంది. సోమవారం తెల్లవారుజామున 3గంటలకు నీటి మట్టం 13.10 అడుగుల వరకు పెరిగింది. ఆపై 16గంటలు నిలకడగా కొనసాగుతుంది. సోమవారం రాత్రి 7గంటలకు నీటి మట్టం అదే రీడింగ్ వద్ద కొనసాగుతుండగా కాటన్ బ్యారేజ్ ద్వారా 11,79,236 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది. ప్రస్తుతం ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. కాగా ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టం క్రమంగా తగ్గుముఖం పడుతుంది.

భద్రచాలం, కాళేశ్వరం వద్ద...

భద్రచాలం వద్ద 48.10 అడుగుల వరకు పెరిగిన నీటి మట్టం 12గంటల పాటు నిలకడగా కొనసాగి తగ్గుముఖం పడుతుంది. సోమవారం రాత్రి 7గంటలకు నీటి మట్టం 43.60 అడుగులకు చేరుకుంది. ఎగువున కాళేశ్వరం వద్ద 12.570 మీటర్ల వరకు పెరిగిన నీటి మట్టం తగ్గుతూ సోమవారం సాయంత్రానికి 9.650 మీటర్లకు చేరుకుంది. పేరూరు వద్ద 16.850మీటర్ల వరకు పెరిగి తగ్గుతూ 14.370 మీటర్లకు చేరుకుంది. దుమ్ముగూడెం వద్ద తగ్గుతున్న నీటి మట్టం 11.800 మీటర్లు, కూనవరం వద్ద 19.610, కుంట వద్ద 10.820, పోలవరం వద్ద 12.750 మీటర్లుగా నీటి మట్టం చేరుకుంది. రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.540 మీటర్లు, ధవళేశ్వరం వద్ద 13.10 అడుగుల వద్ద నీటి మట్టం నిలకడగా ఉంది.

పాఠశాలలో అదృశ్యమై... కాలువలో శవంగా తేలి..

- పాఠశాల వదిలి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు
- రెండు రోజుల తర్వాత దొరికిన విద్యార్థి మృతదేహం
- పోస్టుమార్టం అడ్డుకున్న బంధువులు, రైతుకూలీ సంఘ నాయకులు


విద్యార్థి మృతదేహం

రంపచోడవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రంపచోడవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి వి.వివేకానంద రెడ్డి (14) సోమవారం రంపచోడవరంలోని ఓ వాగులో శవంగా తేలాడు. వివరాల ప్రకారం.. రంపచోడవరం మండలం ఇసుకపట్ల గ్రామానికి చెందిన వివేకానంద రెడ్డి రంపచోడవరం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, వార్డెన్‌తో సహ ఇతర ఉపాధ్యాయులెవరూ లేని సమయంలో ఆరుగురు విద్యార్థులు పాఠశాల వదిలి వాగు వద్దకు వెళ్లారు. కాగా అందులో వివేకానందరెడ్డి తప్ప మిగతా వారందరూ వెనక్కి వచ్చేశారు. వివేకానందరెడ్డి కోసం గాలించినా ఆచూకీ లభించలేదని ఐటీడీఏ ఒక ప్రకటనలో తెలిపింది. విద్యార్థి అదృశ్యమైన సమాచారం ఉన్నతాధికారులెవ్వరికీ పాఠశాల నిర్వాహకులు ఇవ్వలేదు. శనివారం ఉదయం వివేకానందరెడ్డి మృతదేహాన్ని రంపచోడవరంలో ఓ వాగు వద్ద గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే శవపరీక్షను మాత్రం మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా విద్యార్థి బంధువులు, రైతుకూలీ సంఘం నాయకులు అధికారుల తీరుపై ఆందోళనకు దిగారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులను చూడడానికి వచ్చే తల్లిదండ్రులను కట్టడి చేసేందుకు ఉన్న నిబంధనలను పిల్లలు పాఠశాలలు వదిలి వెళ్లకుండా చేసేందుకు లేవా అంటూ గిరిజన సంక్షేమ డీడీని నిలదీశారు. బాధ్యులైన వారిపై సస్పెండ్ చేసి వదిలేయడం కాకుండా సర్వీసు నుంచి తొలగించి, క్రిమినల్ కేసులు కూడా పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలన్నీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన చెప్పారు. తమ డిమాండ్ల మేరకు న్యాయం చేస్తేనే మంగళవారం పోస్టుమార్టం జరగనిస్తామని లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని విద్యార్థి కుటుంబసభ్యులు చెప్పారు.

హెచ్‌ఎం, వార్డెన్‌తో సహా నలుగురు సిబ్బంది సస్పెన్షన్

విద్యార్థి వి.వివేకానందరెడ్డి మృతిపై పూర్తిస్థాయి విచారణ జరిపి వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేడ్కర్‌ను ఆదేశించారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ ఆగస్టు 30 నుంచి వివేకానంద రెడ్డి కన్పించడంలేదని పాఠశాల సిబ్బంది బంధువుల ఇళ్లలో వెతికారని, సోమవారం కాలువలో శవమై కన్పించాడన్నారు. విషయంపై పాఠశాల సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకపోగా విద్యార్థి మృతిపై నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ప్రధానోపాధ్యాయుడు టి.రాజబాబు, వార్డెన్ కుంజం వెంకన్నదొర, ఉపాధ్యాయుడు గరుజుల ధరణిధర్, సీఆర్‌టీలు ఎం.సత్యనారాయణ, లోత చంటిబాబు, సీఆర్‌టీ ఫిజికల్ డైరక్టర్ కె.ప్రసాదరావుదొరను విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు పీవో తెలిపారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఏలేరులో పెరుగుతున్న నీటి నిల్వలు

ఏలేశ్వరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న గోదావరి జాలాలతో పాటు వరద నీరు వచ్చి చేరడంతో కాకినాడ జిల్లా ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా పెరుగుతున్నాయి. పురుషోత్తపట్నం నుంచి 1050 క్యూసెక్కుల చొప్పున నీరు జలాశయంలోకి వచ్చి చేరుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా సోమవారం 14.55 టీఎంసీలకు నీటి నిల్వలు చేరాయి. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 86.56 మీటర్లు కాగా ప్రస్తుతం 80.98 మీటర్లకు చేరింది. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 200 క్యూసెక్కుల నీటిని విడుదలచేస్తున్నట్టు అధికారులు తెలిపారు.


జలాశయంలో నీటి నిల్వలు

ఏసీబీకి చిక్కారు..

- ఆలమూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై దాడి
- రూ.28 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన సబ్‌రిజిస్ట్రార్, కారు డ్రైవర్
- కేసు నమోదు


ఏసీబీ దాడిలో పట్టుపడ్డ ఆలమూరు సబ్‌రిజిస్ట్రార్ సరోజినికుమారి, కారు డ్రైవర్


రైతు సుబ్రహ్మణ్యం

ఆలమూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై సోమవారం ఏసీబీ దాడులు నిర్వహించింది. రాజమహేంద్రవరం ఏసీబీ డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు వాసుకృష్ణ, భాస్కర్, సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో పొలం రిజిస్ట్రేషన్ నిమిత్తం రైతు వద్ద నుంచి నగదు డిమాండ్ చేసి తీసుకుంటుండగా సబ్‌రిజిస్ట్రార్‌ను పట్టుకున్నారు. ఆలమూరు మండలం బడుగువానిలంక గ్రామానికి చెందిన గట్టి సుబ్రహ్మణ్యం అనే రైతు తన పేరు మీద ఉన్న 1.37 ఎకరాల భూమిని తన కుమారుడికి గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయడానికి రూ.50 వేలు ఇవ్వాలని సబ్ రిజిస్ట్రార్ కొన విమలస రోజినీ కుమారి లంచం డిమాండ్ చేసింది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ముప్పిరి వెర్రియ్య ద్వారా బేరం చేసుకుని రూ.28 వేలకు ఒప్పందం కుదిరింది. దీంతో గట్టి సుబ్రహ్మణ్యం ఏసీబీని ఆశ్రయించాడు. సోమవారం రిజిస్ట్రేషన్ అనంతరం రూ.28వేల నగదును సబ్‌రిజిస్ట్రార్ సరోజినీకుమారి కారు డ్రైవర్ డి.దుర్గాప్రసాద్‌కు ఇస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్టు డీఎస్పీ కిషోర్‌కుమార్ తెలిపారు. ఈ నగదుతోపాటు కార్యాలయంలో అదనంగా ఉన్న రూ.35 వేల నగదును కూడా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ఈ మేరకు సబ్‌రిజిస్ట్రార్ సరోజినీకుమారి, కారు డ్రైవర్ దుర్గాప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

విద్యార్థినికి అసభ్యకర మెసేజ్‌లు పంపిన అధ్యాపకుడి సస్పెన్షన్

అన్నవరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం అధ్వర్యంలో నిర్వహిస్తున్న సత్యదేవ డిగ్రీ కళాశాలలో విద్యార్థినికి అసభ్యకర మెసేజ్‌లు పంపిన అధ్యాపకుడిని సస్పెండ్ చేస్తూ సోమవారం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు ఆదేశాలు జారీ చేశారు. డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపకుడికిగా కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న లచ్చన్న అనే ఉద్యోగి డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థినికి అసభ్యకరమైన మెసేజ్‌లు పంపాడని సోమవారం మీడియాలో కథనాలు రావడంతో ఈవో విచారణ చేసి నిర్ణయం తీసుకున్నారు.

మద్యం తాగి విధులకు హాజరైన దేవస్థానం ఉద్యోగిపై...

అన్నవరం జాతీయ రహదారిపై ఉన్న సత్యదేవుడి నమూనా ఆలయం వద్ద ప్రసాదం కౌంటర్‌లో పనిచేస్తున్న దేవస్థానం ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ సోమవారం ఈవో సుబ్బారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రసాదం కౌంటర్‌లో పనిచేస్తున్నముని రాజేంద్రప్రసాద్ అలియాస్ కొంతం పండు మద్యం తాగి ప్రసాదం విక్రయాలు చేస్తున్నాడని భక్తుల ఫిర్యాదు మేరకు దేవస్థానం భద్రతా విభాగం అధికారులు తనిఖీ చేపట్టగా నిజమేనని నిర్ధారణకు వచ్చి ఈవోకు నివేదించడంతో చర్యలు తీసుకున్నారు.

ఏలేశ్వరం కమిషనర్ సస్పెన్షన్

ఏలేశ్వరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణను సస్పెండ్ చేస్తూ రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు సోమవారం ఉతర్వులు జారీ చేసింది. గత నెల 21న బిల్డింగ్ కాంట్రాక్టర్ నుంచి రూ.23 వేలు లంచం తీసుకున్న కమిషనర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ అరుణాచలాన్ని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. వారిపై అధికారులు నమోదు చేసిన కేసు నేపథ్యంలో ఆగస్టు 21 నుంచి కమిషనర్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

తోడుంటానని బంగారు నగలు చోరీ

మహిళపై పోలీసులకు ఫిర్యాదు

పిఠాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తోడుగా ఉంటానని చెప్పి వచ్చి ఒక మహిళ నగలు చోరీ చేసిందని కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణం పల్లపువీధికి చెందిన సురవత్తుల సత్యవేణి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మే నెలలో తన భర్త చనిపోయాడని, తనకు తోడుగా ఉండేందుకు ఇసుకపల్లికి చెందిన రమాదేవి అనే మహిళ వచ్చిందని, 5కాసులు విలువైన బంగారు ఆభరణాలు అపహరించి వెళ్లిపోయిందని ఫిర్యాదులో పేర్కొంది.

రైలు ఢీకొని వృద్ధురాలు మృతి


ఘటనా స్థలంలో సీతామహాలక్ష్మి మృతదేహం


ఫైల్‌ఫొటో

నిడదవోలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొనడంతో వృద్ధురాలు మృతిచెందిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో సోమవారం జరిగింది. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం తెలికిచర్ల గ్రామానికి చెందిన రేకపల్లి సీతామహాలక్ష్మి (70) సుమారు నెల క్రితం నిడదవోలు పట్టణంలోని ఓ కంటి ఆసుపత్రిలో కంటికి ఆపరేషన్ చేయించుకుంది. సోమవారం వైద్యులకు చూపించుకునేందుకు నిడదవోలు వచ్చింది. అయితే పట్టణంలో ఆర్వోబీ పనులు జరుగుతున్నందున ఆర్టీసీ బస్సులను బసివిరెడ్డిపేట శివాలయం వద్ద నిలిపివేస్తున్న నేపథ్యంలో అక్కడ నుంచి పట్టణంలోకి వచ్చేందుకు సీతామహాలక్ష్మి రైలు పట్టాలు దాటుతుండగా విశాఖపట్టణం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొనడంతో మృతిచెందిందని స్థానికులు పేర్కొన్నారు. మృతురాలికి భర్త, ఐదుగురు కుమార్తెలు ఉన్నారని బంధువులు తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఏకే మల్లవరంలో ఒడిసా యువకుడి ఆత్మహత్య

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో ఒడిసా రాష్ట్రానికి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఒడిసా రాష్ట్రంలోని నవరంగపూర్ జిల్లా నేలగుండిగూడ గ్రామానికి చెందిన బైదనాద జానీ (17) ఏకేమల్లవరం గ్రామానికి చెందిన ముదునూరి ధనుంజయవర్మ రొయ్యల చెరువులో పనిచేసేందుకు కూలీ పని నిమిత్తం వచ్చాడు. ఆదివారం రాత్రి 9.30గంటల సమయంలో రొయ్యలచెరువు నుంచి బయటకు వెళ్లిన అతడు కాలువ గట్టు వద్ద గల వేపచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి గల ప్రేమ వ్యవహారం, కుటుంబం ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆత్మహత్య చేసుకున్నట్టు చెప్తున్నారు. యువకుడి తండ్రి మన్ బత్ జానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు గొల్లప్రోలు ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ సోమవారం తెలిపారు.

బెహరాన్‌లో పుల్లేటికుర్రు మహిళ మృతి

మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చిన ఏపీఎన్‌ఆర్టీఎస్ సంస్థ


అర్జమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ బాలరాజు, నాయకులు

అంబాజీపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి నిమిత్తం బెహరాన్ దేశం వెళ్లి అక్కడ మృతి చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రుకు చెందిన కాగిత అర్జమ్మ (62) మృతదేహాన్ని ఏపీఎన్‌ఆర్టీసీ సంస్థ కృషితో స్వగ్రామానికి తీసుకువచ్చారు. వివరాల ప్రకారం.. అర్జన 10 ఏళ్లుగా ఉపాధి నిమిత్తం బెహరాన్‌లో ఉంటుంది. అయితే గత నెల 14న అనారోగ్యంతో అక్కడ మృతిచెందింది. మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువచ్చేందుకు రూ.8లక్షల వరకూ ఖర్చు అవుతుందని కుటుంబ సభ్యులకు తెలియచేయడంతో ఏంచేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ సంస్థ, ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సంస్థ సంయుక్తంగా నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్టు, ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సంస్థలు ఖర్చు భరించి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా కృషిచేశారు. ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సంస్థ సభ్యులు నల్లి రవిశంకర్, కొల్లు సరోజిని, గంజి వెంకటలక్ష్మి, రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యులు ఓ బాలరాజు, సర్పంచ్ జల్లి బాలరాజు, ఉపసర్పంచ్ వీరా రవి, మాజీ సర్పంచ్ నూకపెయ్యి చిన్న, కాండ్రేగుల గోపి, అందె మూర్తి, నాయకులు ఎల్.భాస్కరరావు, కత్తుల బాలరాజు, బాలస్వామిలకు పుల్లేటికుర్రు ఎస్సీ యూనియన్ కమిటీ సభ్యులు, మృతురాలు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మస్కట్ నుంచి స్వగ్రామానికి...

కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ కృషితో చేరిన మహిళ


మన్యం నాగమణి

అమలాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మస్కట్ దేశంలో ఆరోగ్యం బాగోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న మన్యం నాగమణి కోనసీమ సెంటర్‌ఫర్ మైగ్రేషన్ కృషితో సోమవారం క్షేమంగా స్వగ్రామం చేరుకుంది. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలానికి చెందిన సరెళ్ల దివ్య తన తల్లి మన్యం నాగమణి మస్కట్‌లో పడుతున్న ఇబ్బందులను గుర్తించి తిరిగి స్వగ్రామం రప్పించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసింది. ఏజెంట్‌ను సంప్రదిస్తే రూ.1.60లక్షలు కడితేనే ఆమె స్వగ్రామానికి రాగలుగుతుందని చెప్పాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే కావడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ప్రత్యేకంగా వలసదారుల కోసం సెంటర్ ఫర్‌మైగ్రేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు దివ్య తెలుసుకుంది. వెంటనే సెంటర్ ఫర్ మైగ్రేషన్ అధికారులను ఆశ్రయించగా ఏజెంట్‌తో మాట్లాడి మస్కట్ దేశం నుంచి నాగమణిని స్వగ్రామం క్షేమంగా తీసుకువచ్చారని ఆనందంతో తెలిపింది.

కాకినాడలో కాంగ్రెస్ కార్యాలయం ముట్టడి

- బీజేపీ శ్రేణులను అడ్డుకున్న పోలీసులు
- స్వల్ప లాఠీ చార్జి, పలువురికి గాయాలు


కాకినాడలో బీజేపీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ తల్లిపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అధ్యక్షతన జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కాకినాడలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయాన్ని ముట్టడించారు. మెయిన్‌రోడ్, సినిమారోడ్ కూడలిలో ఏర్పాటు చేసిన బారికేడ్లు, ఇనుప కంచెలను బీజేపీ శ్రేణులు తోసుకుంటూ కాంగ్రెస్ కార్యాలయాన్ని ముట్టడించడంతో పరిస్థితిని అదుపులో తేవడానికి పోలీసులు స్వల్ప లాఠీ చార్జి చేసి అడ్డుకున్నారు. దీంతో జిల్లా కాంగ్రెస్ కార్యాలయం బయట రోడ్డు మీద బైఠాయించి రాహుల్ గాంధీ చిత్రపటాన్ని చెప్పుతో కొడుతూ మహిళలను గౌరవించని రాహుల్‌గాంధీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు కుండల సాయికుమార్ యాదవ్, చోడిశెట్టి రమేష్, సాహతీవర్మ, జిల్లా కార్యదర్శి జ్యోతుల రాజేష్, మండలాధ్యక్షుడు దొడ్డి వీరేంద్ర, పలువురు నాయకులు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు. ఘటనలో గాయపడిన నాయకులు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు.

ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య


మనోజ్(ఫైల్)

గండేపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలోని సూరంపాలెంలో ఓ ప్రయివేట్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి గండేపల్లి పోలీసుల వివరాల ప్రకారం.. పార్వతీపురం జిల్లా సాలూరు మండలం దేవబుచ్చంపేట గ్రామానికి చెందిన జి.మనోజ్ (21) సూరంపాలెంలో ప్రయివేట్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. స్నేహితురాలికి, తనకు మధ్య మనస్పర్థలు రావడంతో ఆదివారం హాస్టల్ బాత్‌రూమ్‌లో ఉరేసుకున్నాడు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. దీనిపై అతడి తల్లి అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని గండేపల్లి పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో యువకుడి మృతి


ప్రసాద్ (ఫైల్)

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం చినగాడవిల్లి పంచాయతీ లంకశెట్టిపేటకు చెందిన గుత్తుల ప్రసాద్(36) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. అతడు గణేశ నిమజ్జన ఊరేగింపులో డీజే సౌండ్ కారణంగా గుండె ఆగి కుప్పకూలాడంటూ సామాజిక మాధ్యమాల్లో వార్తలు హల్‌చల్ చేశాయి. ప్రసాద్ ఉదయం నుంచి అనారోగ్యంగానే ఉన్నాడని, ఊరేగింపు నుంచి ఇంటికి వచ్చి ఛాతిలో మంటగా ఉందనడంతో అమలాపురం ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందినట్టు స్థానికులు, బంధువులు తెలిపారు. పోలీసులను వివరణ కోరగా తమ సిబ్బంది ఊరేగింపులో ఉన్నారని, అక్కడ ఎటువంటి సంఘటన జరగలేదని ఎస్‌ఐ చలమల రాజేష్ తెలిపారు.

అర్హులందరికీ పింఛన్లు అందిస్తాం


పి.గన్నవరంలో యువతికి పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అర్హులందరికి పింఛన్లు అందిస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పింఛన్ల పంపిణీలో వైసీపీ బూటకపు ప్రచారాన్ని నమ్మవద్దని ఆయన అన్నారు. పి.గన్నవరం శివారు తాటికాయలపాలెంలో పలువురు లబ్ధిదారులకు పింఛన్లు అందించిన అనంతరం మాట్లాడారు. అనంతరం పలువురు ప్రత్యేక అవసరాలు గల వారికి పింఛన్లు అందించి సమస్యలు తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో కూటమి నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, చొల్లంగి సత్యనారాయణమూర్తి, సంసాని పెదిరాజు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీ

అమలాపురం టౌన్, (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని 25వ వార్డులో సోమవారం అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పెన్షన్లు పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడుతో కలిసి పట్టణంలోని ఆయా వీధుల్లో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, టీడీపీ పట్టణశాఖ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, ఏఎంసీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, కర్రి రామస్వామి, భాస్కర్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ దుష్ప్రచారాన్ని నమ్మవద్దు

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో కూటమి నాయకులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. పండుగ వాతావరణంలో దివ్యాంగులకు వారు పింఛన్లు అందజేశారు. వైసీపీ నాయకుల దుష్ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన పింఛన్ల పంపిణీలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): పొన్నమండ, కడలి గ్రామాల్లో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాజోలు ఎంపీపీ కడలి శ్రీదుర్గ సోమవారం పెన్షన్లు పంపిణీ చేశారు.


అమలాపురంలో దివ్యాంగుడికి పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఈ సందర్భంగా డెల్టా చైర్మన్ మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, చాగంటి స్వామి, మేడిచర్ల సత్యవాణి, ఎంపీటీసీ మోకా ఉష తదితరులు పాల్గొన్నారు.

95 శాతం అందించాం

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలో 95 శాతం పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఏవీఎల్ నరసింహం తెలిపారు. ఆయా గ్రామాల్లో కూటమి నేతల చేతులు మీదుగా సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో దాసరి వీరవెంకట సత్యనారాయణ, నాగాబత్తుల వెంకటసుబ్బరావు, గుడాల ఫణి, దొమ్మేటి సురేష్‌కుమార్, పెదపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి నిమజ్జనాలు

అంబాజీపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రుల్లో భాగంగా కోరివారి అగ్రహారంలో వరసిద్ధివినాయకుడిని సోమవారం గంధంతో అలంకరించారు. ఆలయ అర్చకులు ప్రవీణ్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారిని అందంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మండలంలోని ఆయా గణపతి పందిర్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతులను ఊరేగించి నిమజ్జనం చేశారు. కొర్లపాటిపాలెంలో గణపతిని సీఐ రుద్రరాజు భీమరాజు దర్శించుకుని పూజలు చేశారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం వినాయక నిమజ్జనాలు జరిగాయి. పి.గన్నవరం వార్ఫ్‌లో వరసిద్ధి వినాయకుని ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన వినాయకుని ఊరేగింపులో కేరళ వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వైనతేయ గోదావరినదిలో నిమజ్జనం చేశారు. పి.గన్నవరం శివారు పితానిపాలెంతో పాటు లంకలగన్నవరం, మొండెపులంక, మానేపల్లి, ముంగండ, నరేంద్రపురం, గంటిపెదపూడి తదితర గ్రామాల్లో గణేష్ నిమజ్జనాలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లడ్డూ రూ.83 వేలు: మానేపల్లి శివారు తారకరామకాలనీలో వరసిద్ధి వినాయక యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని మండపంలో ఏర్పాటు చేసిన లడ్డూను రూ.83 వేలకు కాండ్రేగుల పవన్ కుమార్, కడలి దుర్గాప్రసాద్ దక్కించుకున్నారు. తొమ్మిదిరోజుల పూజల అనంతరం వారికి అందిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

అన్న సమారాధన

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రుల్లో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బి.దొడ్డవరం గ్రామంలో శాలివాహనుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న సమారాధన నిర్వహించారు. అనంతరం భక్తుల కోలాహలం మధ్య వినాయక విగ్రహాన్ని గోదావరిలో నిమజ్జనం చేశారు. మామిడికుదురు నూకాలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మందిరం వద్ద గణపతి హోమాన్ని నిర్వహించారు.

పరిహారం అందించి ఆదుకోరూ..

అమలాపురం టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సముద్రంలో వేటకు వెళ్లి గల్లంతై నాలుగు నెలలు గడిచినా ఇప్పటికీ మృతదేహం లభ్యం కాలేదని కుటుంబ సభ్యులు వాపోయారు. ఐ.పోలవరం మండలం మురమళ్ల గ్రామానికి చెందిన భార్య సంగాడి అంజలి (19), కొడుకును కోల్పోయిన తల్లి వెంకాయమ్మతో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో అర్జీ ఇచ్చారు. మురమళ్ల పితానివారిపాలెంలో ఉంటున్న వీరబాబు(25) ఈ ఏడాది ఏప్రిల్ 22న చేపల వేట నిమిత్తం మరొకరితో కలిసి కేరళలోని తొప్పుంపాడి ఫిషింగ్ హార్బరుకు చేరుకున్నారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లి 28న రాత్రి సమయంలో వీరబాబు బోటు నుంచి జారిపడి సముద్రంలో గల్లంతయ్యాడు. ఈ విషయాన్ని 29న ఉదయం సహచరుడైన సంగాడి ధర్మారావు ఫోన్‌లో వారి కుటుంబ సభ్యులకు తెలిపాడు. అదేరోజున మహారాష్ట్రలోని రత్నగిరి హార్బరులో భర్త వీరబాబు గల్లంతైన విషయంపై అంజలి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. వీరబాబుకు వృద్ధురాలైన తల్లి వెంకాయమ్మతో పాటు భార్య అంజలి, కుమారుడు గణేష్ (4), కుమార్తె లక్ష్మీవెన్నెల (11 నెలలు) ఉన్నారు. ఇటీవల గవర్నమెంట్ ఆఫ్ పాండిచ్చేరి స్పెషల్ రిప్రంజంటేటివ్ మల్లాడి కృష్ణారావును అంజలి కుటుంబ సభ్యులు కలుసుకుని తమగోడును వివరించారు. జరిగిన ఘటనను వివరిస్తూ ఆయన కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు లేఖ రాయడంతో పాటు ఆ కుటుంబ పరిస్థితిని ఆయనకు స్వయంగా వివరించారు. ప్రభుత్వ పరంగా పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు వారు అర్జీ అందించారు.

బీజేపీ నాయకుల వినతిపత్రం

అంతర్వేది, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో ఎంపీడీవో, ఎమ్మార్వోలకు సోమవారం బీజేపీ నాయకులు గ్రీవెన్స్‌లో వినతి పత్రాలు ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం అనేక గ్రామాల్లో ఇంకా ఈకేవైసీ ప్రక్రియ పూర్తికాకపోవడం వల్ల లబ్ధిదారులకు కార్డులు అందడం లేదని, ప్రజలు అత్యవసర వైద్యసేవలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే కేవైసీ పూర్తిచేసి ప్రజల ఆరోగ్య భద్రత అందించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్, కార్యదర్శి బోనం నాయుడు, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాసనగేష్, చెంపాటి శివరామకృష్ణంరాజు, పట్టాపు సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలకు మహిళా మోర్చా నిరసన

అమలాపురం టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ మాతృమూర్తిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ మహిళా మోర్చా జిల్లాశాఖ మాజీ అధ్యక్షురాలు చిలకమర్రి కస్తూరి ఆధ్వర్యంలో సోమవారం గడియార స్తంభం సెంటర్‌లో నిరసన చేపట్టారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్ మాట్లాడుతూ మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసినవారు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసుస్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. నిరసనలో రాష్ట్ర నారీశక్తి కన్వీనర్ చిట్టూరి రాజేశ్వరి, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకురుమెల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే చిట్టబ్బాయి జయంతి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అమలాపురం మాజీ ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయి జయంతిని వైసీపీ శ్రేణులు నిర్వహించారు. గడియార స్తంభం సెంటర్‌లో చిట్టబ్బాయి విగ్రహానికి జిల్లాశాఖ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి హాజరై నివాళులర్పించారు. వైసీపీ పార్లమెంటు పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి తదితరుల సమక్షంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో చిట్టబ్బాయి సతీమణి అరుణ, పట్టణశాఖ అధ్యక్షుడు సంసాని వెంకటచంద్రశేఖర్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించరూ..

అమలాపురం టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో పలువురు అర్జీలు అందించారు. ఈదరపల్లి గ్రామానికి చెందిన అడపా దమయంతి సోమవారం అర్జీ అందించారు. గోడి గురుకుల పాఠశాల (బాలురు)లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎంసీ చైర్మన్ బీర భరత్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభాకర్, లక్ష్మి తదితరులు అర్జీ అందించారు. ఉపాధి హామీ అనుసంధానంతో చేపట్టిన పల్లె పండుగ పనులకు నిధులు విడుదల చేయకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని అయినవిల్లి, అమలాపురం, అంబాజీపేట మండలాలకు చెందిన కాంట్రాక్టర్లు అర్జీ అందించారు.

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

చేనేత సొసైటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): విలసవిల్లి చేనేత సహకార సంఘ భవనం సమస్యను అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు పరిష్కరించారు. సీఎస్ఆర్ నిధులతో భవన నిర్మాణానికి ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నలాది ఊర్మిళ, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


పి.గన్నవరం మండలం గంటిపెదపూడి ఏటిగట్టు దిగువన కాజ్‌వేపై నుంచి వస్తున్న విద్యార్థినులు


మామిడికుదురు మండలం అప్పనపల్లి కాజ్‌వేపై నిలిచిన వరదనీరు


యానాంలో రాజీవ్‌గాంధీ బీచ్‌పైకి చేరిన వరద నీరు


ముమ్మిడివరం మండలం గురజాపులంక వద్ద వరద ప్రవాహం

వీడని వరద...తప్పని అవస్థలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువన వరద ఉధృతి నిలకడగా కొనసాగుతున్నా మండలంలోని ఆయా లంక గ్రామాల్లో వరద ముంపు ఇంకా కొనసాగుతోంది. ఆదివారం రాత్రికి వరదనీరు మరో అడుగు పెరిగింది. దీంతో పల్లపు ప్రాంతాల్లో రోడ్లపై మూడు అడుగుల ఎత్తులో వరదనీరు ప్రవహిస్తున్నది. వివేకానంద వారధి నుంచి గురజాపులంక వెళ్లే రోడ్డు గురజాపులంక వద్ద సుమారు 200 మీటర్ల మేర రోడ్డుపై నుంచి మూడు అడుగుల ఎత్తులో వరదనీరు ప్రవహిస్తున్నది. కూనాలంక వద్ద కూడా రోడ్డుపై నుంచి వరదనీరు ప్రవహిస్తుంది. రామాలయం చుట్టూ వరదనీరు చేరింది. లంకాఫ్ ఠాణేలంక అంబేడ్కర్ విగ్రహం వద్ద రోడ్డుపై నుంచి వరదనీరు ప్రవహిస్తున్నది. ఆయా లంక గ్రామాల్లో ఇంటర్నల్ రోడ్లు వరద ముంపులో ఉన్నాయి. గురజాపులంక, కూనాలంక, లంకాఫ్ ఠాణేలంక, లంకాఫ్ గేదెల్లంకలో లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు ప్రవేశించింది. ఆయా లంక గ్రామాల రైతులు పొలాలు వెళ్లేందుకు లంకాఫ్ ఠాణేలంక, గురజాపులంక, లంకాఫ్ గేదెల్లంక వద్ద మెకనైజ్డ్ బోట్లు ఏర్పాటు చేశారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది వైద్య శిబిరాలు కొనసాగిస్తున్నారు. మోకాళ్లలోతు నీటిలోనే లంకవాసులు, విద్యార్థులు, రైతులు రాకపోకలు సాగిస్తున్నారు. తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూము యథావిధిగా కొనసాగుతోంది. నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎస్.మధుసూదన్, మండల అధికారి బి.గౌతమ్, తహశీల్దార్ టి.సుభాష్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు పింఛను అందజేశారు. వరద ముంచెత్తడంతో పశుగ్రాసం కొరత ఏర్పడుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయా లంక గ్రామాల్లో సుమారు 550 ఎకరాల్లో సాగు చేసిన కూరపాదులకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు.

వరద ముంపులోనే రహదారులు, కాజ్‌వే

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువన తగ్గుతున్నప్పటికి ధవళేశ్వరం వద్ద వరద నీరు నిలకడగా కొనసాగుతోంది. దీంతో దిగువన నదీపాయలు ఇంకా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పి.గన్నవరం మండలంలో మానేపల్లి శివారు శివాయిలంకకు వెళ్లే రహదారి నీటమునగడంతో అధికారులు ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌పై రాకపోకలు సాగిస్తున్నారు. మధ్యాహ్నం కొంత మేర నీరు పెరగడంతో ట్రాక్టర్ సైతం తిరిగే పరిస్థితి లేకపోవడంతో లంక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. కనకాయలంక కాజ్‌వే ఇంకా వరదనీటిలోనే ఉండటంతో నాటుపడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. నాగుల్లంక ఏటిగట్టు దిగువన ఉన్న రాయిలంకకు వెళ్లే రహదారి నీటమునగడంతో స్థానికులు రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారు. కె.ఏనుగుపల్లిలో ప్రభుత్వ ఇళ్లస్థలాలు, రైతుసేవా కేంద్రం, అంగన్వాడీ కేంద్రాలు వద్దకు వరదనీరు చేరుతోంది. పశ్చిమ గోదావరి జిల్లా గ్రామాలైన పెదమల్లంక, అనగార్లంక బెల్లంపూడి, వైవిపాలెం వద్ద నదీపాయలపై పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. గంటిపెదపూడి, ఊడిమూడి గ్రామాలో పరిధిలో ఉన్న నాలుగు లంక గ్రామాల ప్రజలు బూరుగులంక నదీపాయపై పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. గంటిపెదపూడి ఏటిగట్టు దిగువన కాజ్‌వేపైకి వరదనీరు చేరడంతో రాకపోకలు సాగించడానికి రైతులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని నదీతీర ప్రాంతాల్లో ఉన్న ఆయా ఉద్యాన పంటలు ఇంకా వరదనీటిలోనే ఉన్నాయి.

జలదిగ్బంధంలోనే లంక గ్రామాలు

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): గోదావరిలో వరద నిలకడగా ఉన్నప్పటికీ మూడు లంక గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. పెదపట్నంలంక, బి.దొడ్డవరం, అప్పనపల్లి గ్రామాలకు వెళ్లే అప్పనపల్లి కాజ్‌వేను ముంచివేయడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల నుంచి అప్పనపల్లి ఉచ్చులవారిపేట మీదుగా రాకపోకలు సాగిస్తున్నప్పటికీ ఉచ్చులవారిపేటలోని చర్చి వద్ద వరద తాకడంతో ఇబ్బందుల మధ్య ప్రయాణాలు చేస్తున్నారు. అప్పనపల్లి స్నానాలరేవు వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతోంది. పాశర్లపూడి బాడవలోని కనకదుర్గమ్మ ఆలయం చుట్టూ వరదనీరు చేరడంతో భక్తులు వరద నీటిలోనే అమ్మవారిని దర్శించుకుంటున్నారు. వైనతేయ వారధి వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తున్నది. దాదాపు లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లోని ఆయా కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మూడుసార్లు వరద రావడంతో లంక గ్రామాల్లోని కూరగాయల పంటలకు అపారనష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. మంగళవారం నాటికి వరద తగ్గుముఖం పట్టే సూచనలు ఉన్నాయని ప్రజలంటున్నారు.

గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి: ముంపు గ్రామాల్లోని గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి దుర్గారావుదొర సూచించారు. సోమవారం పాశర్లపూడి, శ్రీరాంపేట, అప్పనపల్లి గ్రామాల్లో పర్యటించారు. రెండు రోజుల్లో ప్రసవించనున్న కాటారి ఆదిలక్ష్మితో మాట్లాడి తక్షణమే ఆమెను అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించాలని సిబ్బందికి ఆదేశాలిచ్చి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన రెండు వైద్య శిబిరాలను పరిశీలించారు. ఆయన వెంట అడిషనల్ డీఎంహెచ్‌వో భరతలక్ష్మి, పలువురు సిబ్బంది ఉన్నారు.

పాఠశాలలకు సెలవు

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో వరద పెరిగిన కారణంగా విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని సెలవు ప్రకటించారు. అప్పనరామునిలంక, కొత్తలంక, ఎంజీఏపీఆర్ లంక, రాజులమెరక, ఆర్వీఎంఏపీఆర్ లంకల్లో ఎంపీపీఎస్ పాఠశాలలకు ఎంఈవోలు తెలిపారు. రహదారుల పైకి వచ్చిన వరదతో రాకపోకలకు అంతరాయం కలిగింది. సఖినేటిపల్లి రేవులో నర్సాపురం వెళ్లేందుకు పంట్లు నిలిపివేయడంతో ప్రయాణికుల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది.

యానాంలో వరద ప్రవాహం

యానాం, (ఆంధ్రజ్యోతి): నియోజవర్గంలో వరద ప్రవాహం పెరుగుతోంది. యానాం జీఎంసీ బాలయోగి వారధి వద్ద వరద ప్రవాహం ఉధృతంగా సాగుతోంది. ధవళేశ్వరం నుంచి లక్షల క్యూసెక్కుల వరదనీరు సముద్రంలోకి వదలడంతో యానాం గౌతమి గోదావరి గుండా సముద్రంలోకి చేరుతోంది. ఈనేపథ్యంలో యానాం రాజీవ్‌గాంధీ బీచ్‌పైకి రావడంతో పాటు పలు పర్యాటక కట్టడాలు, పర్యాటక కేంద్రాలు వరద ముంపునకు గురవడంతో పలువురు తిరుగుముఖం పడుతున్నారు.

వైభవంగా లక్ష్మీగణపతి హోమం

అమలాపురం రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్ర జ్యోతి): బండారులంక బాలగణపతి, భక్తాంజనేయస్వామి ఆలయంలో వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా సహస్ర ఉండ్రాళ్లతో సోమవారం శ్రీలక్ష్మీగణపతి హోమం, శ్రీసూక్త హోమాలు నిర్వహించారు. గుణనాగ ప్రణవికి చిల్లర నాణేలతో తులాభారం నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కలశ నిమజ్జనం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంకం హిమభారతి, ఆలయ ప్రతినిధులు బళ్ల సత్తిరాజు, లక్కింశెట్టి శ్రీధర్, చింతా లూలి, కటకం నాని, అంకం ప్రసాద్, జాన డిల్లీ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఎర్రవంతెన వద్ద జనసేన నాయకులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అమలాపురం, పి.గన్నవరం ఎమ్మెల్యేలు ఆనందరావు, సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. జనసేన నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, బీజేపీ అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్, నాయకులు పెచ్చెట్టి విజయలక్ష్మి, అధికారి జయవెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో...

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ముందస్తు పుట్టినరోజు వేడుకలను సోమవారం ముమ్మిడివరంలో నిర్వహించారు. సోమవారం శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇరిగేషన్ డిపార్టుమెంట్ చైర్మన్, మండపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, ఇరిగేషన్ డిపార్టుమెంట్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పట్టణ అధ్యక్షుడు కర్రా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో 106 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో దాట్ల పృథ్వీరాజ్, ఓగూరి భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం

మామిడికుదురు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు 30 సంవత్సరాలుగా పాలన చేస్తున్నారని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు అన్నారు. మగటపల్లిలో సోమవారం ఆయన స్థానిక విలేకరులతో పోట్లాడుతూ 30 సంవత్సరాల కాలంలో నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయిన ఘనత సీఎం చంద్రబాబుదని కొనియాడారు. కార్యక్రమంలో వర్ధినేని వెంకట్రామయ్య, చెల్లింగి సింహాచలం నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం సంతాప దినాలు

మామిడికుదురు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మొహర్రం సంతాప దినాలు సోమవారంతో ముగిశాయి. సోమవారం ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్, అతని పరివారానికి కన్నీటి వీడ్కోలు పలికారు. మామిడికుదురులోని ఇమామ్‌రజా పంజా నుంచి పీర్లను, గుమ్మటాన్ని తీసి ఊరేగింపు చేశారు.

చంద్రబాబు విజన్‌తో రాష్ట్రాభివృద్ధి సాధ్యం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కోట్లాది మంది తెలుగు ప్రజల నమ్మకం సీఎం చంద్రబాబు అని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. చంద్రబాబు విజన్‌ను దేశంలోని ఇతర రాష్ట్రాలతో పాటు ఎన్నో దేశాలు అభినందిస్తున్నాయని వివరించారు. అమలాపురంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు స్వగృహం వద్ద చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతూ సోమవారం అభినందన సభ జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధిని కొనసాగించే సత్తా చంద్రబాబుకు మాత్రమే ఉందన్నారు. సమావేశంలో మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, ఏఎంసీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, నాయకులు తిక్కిరెడ్డి నేతాజీ, నల్లా స్వామి, పొలమూరి ధర్మపాల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

టీడీపీ కార్యాలయంలో సంబరాలు

ముమ్మిడివరం, సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారంచేసి 30 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గొలకోటి దొరబాబు ఆధ్వర్యంలో సంబరాలు చేశారు. మండపేట జనసేనపార్టీ ఇన్‌చార్జి, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ కేక్‌ను కట్ చేసి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో దాట్ల పృథ్విరాజ్, చెల్లి అశోక్, దొమ్మేటి రమణకుమార్, ఓగూరి భాగ్యశ్రీ, బద్రి రమాదేవి తదితరులతో పాటు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కాట్రేనికోన, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): చెయ్యేరులో సోమవారం పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జనసేన నాయకుడు వేగుళ్ళ లీలాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ, దాట్ల పృథ్వీ, గుద్దటి జమ్మి, చెల్లి సురేష్, టీవీబీ నారాయణస్వామి, సొసైటీ చైర్మన్ త్సవటపల్లి శ్రీనివాస్, త్సవటపల్లి నాగేంద్ర, నడింపల్లి సుబ్బరాజు, నంద్యాల వెంకటేశ్వరరావు, గోదాసి పుండరీష్, బసవా మురళి, కాయల బలరామ్, నూకల దుర్గబాబు, మోకా బాలప్రసాద్, బద్రి రామ, చెల్లి అశోక్, నూకల మూర్తి, నల్లా పవన్, గాలిదేవర బుల్లి, బాలాజీ, నంద్యాల సురేంద్ర, నంద్యాల శివాజీ, అక్కల బాలకృష్ణ, నంద్యాల బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

మామిడికుదురు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు కోఆపరేటివ్ సొసైటీ రిజిస్ట్రార్ ఏసునాయన తెలిపారు. ఈ శిబిరాన్ని కోఆపరేటివ్ బ్లడ్ డోనర్స్, వలంటీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నామని తెలిపారు.

అభిమాన సంఘ నాయకుల సేవలు ప్రశంసనీయం

రాజోలు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో మెగాస్టార్ చిరంజీవి స్ఫూర్తితో అభిమాన సంఘ నాయకులు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం శుభ పరిణామమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. కడలి జనసేన పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో సోమవారం జరిగిన మెగా బ్లడ్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మెగాస్టార్ చిరంజీవి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు జనసేన నాయకులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కడలి జనసేనపార్టీ నాయకులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీలు కడలి శ్రీదుర్గ, మేడిచర్ల సత్యవాణి తదితరులతో పాటు, చిరుపవన్‌చరణ్ సేవా సమితి సభ్యులు, అభిమానులు, ఏన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ మాదిరిగా ఈఎస్ఈలో మంచి అవకాశాలు
ఐఈఎస్‌లో 65వ ర్యాంకర్ ప్రగతి

పి.గన్నవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ మాదిరిగానే ఈఎస్ఈ ఉంటుందని ఈ రెండు పరీక్షలను యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ నిర్వహిస్తుందని ఐఈఎస్‌లో 65వ ర్యాంకు సాధించిన మోసుగంటి ప్రగతి అన్నారు. పి.గన్నవరంలో తాను చదువుకున్న సాయితేజ పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మానానికి హాజరైన ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. యూపీఎస్సీ ద్వారా నిర్వహించే ఈఎస్ఈలో కూడా మంచి అవకాశాలు ఉన్నాయనే విషయం ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థులు ముఖ్యంగా తెలుసుకోవల్సిన అవసరం ఉందన్నారు. బీటెక్, బీఈ చేసిన విద్యార్థులు ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామ్‌కు అర్హులన్నారు. కష్టపడితే విజయం తథ్యమని ఆమె తెలిపారు.

యానాం ఎస్పీగా వరదరాజన్

యానాం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నూతన ఎస్పీగా పుదుచ్చేరికి చెందిన వరదరాజన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీ కార్యాలయంలో సీఐ అడలరసన్, ఎస్ఐలు పునీత్‌రాజ్, ఇలాంగోవాన్, నూకరాజు, సుబ్బరాజు తదితర సిబ్బంది సత్కరించారు.

గవర్నర్‌కు వినతిపత్రం

యానాం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఓఎన్‌జీసీ పైప్‌లైన్ లీకేజీ ఘటనకు సంబంధించి పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాస్‌నాథాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సోమవారం పుదుచ్చేరి రాజ్‌నివాస్‌లో గవర్నర్‌ను కలసి జరిగిన సంఘటనను వివరించారు. అనంతరం సీఎం కార్యాలయంలో సీఎం రంగసామికి వినతి ప్రతం అందించారు.

సీఎంను కలిసిన తోటరాజు: యానాంలో చమురు సంస్థ పైప్‌లైన్ లీకేజీకు సంబంధించి సీఎం రంగసామిని యానాంకు చెందిన రాజకీయ నాయకుడు తోటరాజు కలిసి వినతిపత్రం అందించారు. తన బృందంతో కలిసి యానాం నుంచి పుదుచ్చేరి వెళ్లిన తోటరాజు పలువురు నాయకులను కలిశారు. అసెంబ్లీ హాలులో సీఎంకు వినతిపత్రం అందించి పరిహారం అందేలా కృషి చేయాలన్నారు.

కొల్లూరికి సత్కారం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): విశాఖ కళాభారతి ఆడిటోరియంలో ఉత్తరాంధ్ర సాహిత్య సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించారు. ఆంధ్ర సారస్వత పరిషత్, విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా సంగీతం, నృత్య ప్రదర్శనలు, కవి సమ్మేళనాలు నిర్వహించారు. దీనికి వ్యాఖ్యాతగా, సమన్వయకర్తగా వ్యవహరించిన అమలాపురానికి చెందిన కవి డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరిని ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, నగర కమిషనర్ ఆఫ్ పోలీస్ శంఖబ్రత బాబ్చి సత్కరించారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

కె.గంగవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులంతా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఎస్ఎస్ఏ ఏఎంవో పీ. రాంబాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన గుడిగళ్లభాగ పాఠశాలలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనం రికార్డులను పరిశీలించారు.

చంద్రబాబు .. అరుదైన నాయకుడు : ఎమ్మెల్యే


ఎమ్మెల్యే జోగేశ్వరరావు

మండపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు నాయుడు లాంటి రాజకీయ నాయకుడు అరుదుగా ఉంటారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసి సోమవారంతో 30 ఏళ్ల అయిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సంపూర్ణ ఆయురారోగ్యంతో పాటు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

రాయవరం: చంద్రబాబు దార్శనికుడు అని, సమకాలీన రాజకీయాల్లో ఆయనకు ఎవరూ సాటి లేరని మాజీ ఎమ్మెల్సీ వీవీఎస్ఎస్ చౌదరి అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణస్వీకారం చేసి సోమవారంతో 30 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన ఎదుర్కొన్న ఆటుపోట్లు గురించి వివరించారు. హుద్‌హుద్ తుఫాన్, బుడమేరు వరదల విపత్తులు వచ్చినపుడు ప్రజలకు చేసిన సేవలు గురించి వివరించారు. నేటి యువత ఆయన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు.

ఉద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మండపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు సీపీఎస్ విధానం అమలు చేయటాన్ని నిరసిస్తూ సోమవారం ద్వారపూడిలో ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉద్యోగుల తాలూకా ఏపీజీఈఏ అధ్యక్షుడు ఎంవీవీఎస్ ప్రసాద్ సారథ్యంలో నినాదాలు చేశారు. అనంతరం నల్లబ్యాడ్జీలను ధరించారు. కార్యక్రమంలో ఉద్యోగులు మాణిక్యం ప్రియదర్శన్, డాక్టర్ సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ బలోపేతానికి చర్యలు

మండపేట సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) ఎమ్మార్పీఎస్‌ను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు గ్రామ, మండల నియోజకర్గ స్థాయి కమిటీలను జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఏర్పాటు చేస్తున్నట్టు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి దూలి జయరాజు చెప్పారు. సోమవారం కేశవరంలో గ్రామ కమిటీని నియమించారు. ఇందులో కమిటీ అధ్యక్షుడిగా శెట్టి విద్యాసాగర్, ఉపాధ్యక్షుడిగా చంద్రమళ్ల బాబీ, కార్యదర్శిగా కొత్తపల్లి చరణ్, జాయింట్ కార్యదర్శిగా మందపల్లి చంటి, ట్రెజరర్లుగా దొండపాటి దయానంద్, వైరాల బాలును ఎన్నుకున్నారు.

మట్టి వినాయకుడికి పూజలు



కె.గంగవరం, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): మండలంలో గణపతి నవరాత్రులను భక్తులు ఉత్సాహంగా జరుపుతున్నారు. గంగవరం ఓసీ కాలనీలో ఆ కాలనీ వాసులు మూడడుగుల మట్టి వినాయకున్ని ఏర్పాటు చేసి పూజిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా తామంతా మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిఏటా ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు చెబుతున్నారు.

నిలకడగా ప్రవహిస్తున్న గోదావరి


కోటిపల్లి ఫెర్రీ రేవులో దుకాణ సముదాయం వరకు చేరుకున్న నీరు

కె.గంగవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో కోటిపల్లి వద్ద గోదావరి నిలకడగా ప్రవహిస్తోంది. పుష్కరాల రేవు, ఫెర్రీరేవు, లంక పొలాలు వరదల్లో చిక్కుకున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టడంతో మరో 24 గంటల్లో కోటిపల్లి వద్ద తగ్గే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.

కపిలేశ్వరపురం: ఉధృతంగా ప్రవహిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన గోదావరి ఉధృతి క్రమేణా తగ్గుముఖం పడుతోంది. దీంతో నదీ పరీవాహక ప్రాంతాలైన తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లితో పాటు లంకగ్రామాలైన కేదార్లంక, వీధివారిలంక, నారాయణ లంక, అద్దంకివారి లంక, పల్లపులంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే లంక గ్రామాల్లోని బొప్పాయి, కంద, అరటి, కూరగాయ, తదితర పంటలు ఇంకా ముంపులోనే ఉన్నాయి.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన లీలాకృష్ణ

మండపేట సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి) ద్వారపూడికి చెందిన జన సైనికుడు కుండ సత్తియ్య మరణం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి,ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన సత్తియ్య కుటుంబ సభ్యులను సోమవారం వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా లీలాకృష్ణ మాట్లాడుతూ పార్టీ పరంగా అన్ని సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆయన వెంట స్థానిక జనసేన పార్టీ నాయ కులు, మండపేట మండల వైస్ ఎంపీపీ గర్రి రమణ, మాజీ సర్పంచ్ వీరభద్రరావు, కుంచే ప్రసాద్, చింతా దొరబాబు, తదితరులు వున్నారు.

రైతులను ఆదుకోవటంలో ప్రభుత్వం విఫలం

మండపేట సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవటంలో ఘోరంగా విఫలమైందని వైసీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆరోపించారు. సోమవారం మండపేట పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్థానిక వైసీపీ నేతలతో కలిసి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇంత దారుణమైన పరిస్థితులు లేవన్నారు. సమావేశంలో వైసీపీ నేతలు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి దూలం వెంకన్నబాబు, వైఎస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, కేశవరం సర్పంచ్ పెదపాటి సత్యన్నారాయణ, మాజీ జెడ్‌పీటీసీ పోతుల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీను కలిసిన పోతుల సోదరులు

ద్వారపూడికి చెందిన పోతుల సోదరులు సోమవారం ఎమ్మెల్సీ తోటను మండపేట పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వైసీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శిగా నియమితుడైన పోతుల ప్రసాద్ తన సోదరుడు,మాజీ జెడ్‌పీటీసీ సభ్యుడు రాంబాబుతో వచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు తోటను శాలువాతో సత్కరించారు. అలాగే ప్రసాద్‌ను తోట అభినందించారు.

వాసు వెళ్లినా ... పార్టీకి ఎలాంటి నష్టం లేదు

● వైసీపీ ఎంపీటీసీలు

మండపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ తన వ్యక్తిగత ప్రయోజనాల కోసంతోపాటు టీడీపీ ప్రలోభాలకు లోబడి పార్టీ మారుతున్నాడని వైసీపీ ఎంపీటీసీలు ఆరోపించారు. సోమవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆ పార్టీ నేతలు వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, జెడ్‌పీటీసీ కురుపూడి భవాని రాంబాబు, ఇతరులు మాట్లాడుతూ వాసు తమను కూడా పార్టీ మారమని ఫోన్లు చేసి ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. తాము వైసీపీ తరఫున గెలిచామని, ఎన్ని కష్టాలు వచ్చినా మారబోమని చెప్పామన్నారు. వైసీపీకి మండలంలో 17 మంది సభ్యుల బలం ఉందన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పార్టీ అధ్యక్షుడు జగన్ సారథ్యంలో తామంతా పార్టీ కోసం పని చేస్తామని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో పార్టీ పటిష్టతకు కృషి చేస్తామన్నారు.

సహస్ర ఉండ్రాళ్లతో లక్ష్మీగణపతి హోమం

అమలాపురం రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బండారులంక బాలగణపతి, భక్తాంజనేయస్వామి ఆలయంలో వినాయకచవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా సహస్ర ఉండ్రాళ్లతో సోమవారం శ్రీలక్ష్మీగణపతి హోమం, శ్రీసూక్త హోమాలు నిర్వహించారు. అనంతరం వెయ్యి మందికి అన్నప్రసాద వితరణ చేశారు. గుణనాగ ప్రణవికి చిల్లర నాణేలతో తులాభారం నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కలశ నిమజ్జనం జరిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంకం హిమభారతి, ఆలయ ప్రతినిధులు బళ్ల సత్తిరాజు, లక్కింశెట్టి శ్రీధర్, చింతా లాలి, కటకం నాని, అంకం ప్రసాద్, జాన డిల్లీ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్ : ఎమ్మెల్యే


మండపేట పట్టణంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వేగుళ్ల జోగేశ్వరరావు, నేతలు

మండపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తామని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక కూటమి నాయకులతో కలిసి సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని 20వ వార్డుకు చెందిన కిడ్నీ బాధితుడికి రూ. 10 వేలు నూతన పింఛన్ అందించారు. కార్యక్రమంలో 17వవార్డు కౌన్సిలర్ కాళ్లకూరి స్వరాజ్యభవాని శ్రీనివాస్, శెట్టిరవి, నాగేశ్వరరావు, తాతా నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న సత్యం

కె.గంగవరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదలకు వైద్యసేవలు అందించి, వారి కుటుంబాలను ఆర్థికంగా కూటమి ప్రభుత్వం ఆదుకుంటోందని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి, టీడీపీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం అన్నారు. సోమవారం పామర్రుకి చెందిన మేడిశెట్టి కిరణ్ కుమార్‌కు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన రూ. లక్ష చెక్కును అందజేశారు. కిరణకుమార్ ఇటీవల గొంతు సమస్యతో బాధపడి ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స చేయించుకున్నాడు. అనంతరం ఆర్థికంగా ఇబ్బంది పడ్డాడు. సమస్యను మంత్రి దృష్టికి స్థానిక టీడీపీ నేత మరివాడ సూరిబాబు తీసుకెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు మంజూరు చేయించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మాటూరినాని, కుడుపూడి గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల భరతనాట్యం


అంగరలో నిర్వహించిన భరతనాట్యం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ ఆదిగణపతి ఆలయం వద్ద గణపతి నవరాత్రుల్లో భాగంగా ఆదివారం రాత్రి చిన్నారులతో ఏర్పాటు చేసిన భరతనాట్యం ఆకట్టుకుంది. కోకిలవాణి కళాక్షేత్రం, మండపేటకు చెందిన కోకిలవాణి రాజు సంగీత శిక్షణలో నాట్యా చారిణి నాదశ్రీ బృందంచే ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన లడ్డూ వేలంలో బత్తిన శ్రీను, ఎర్ర సుబ్బారావు, కొల్లాటి సురేష్ పాల్గొని 11 కేజీల లడ్డూను రూ. మూడు వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక గ్రామస్థులు, భక్తులు, మహిళలు, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 68 రోజుల సంతాప దినాలు


ఇమాం హుస్సేన్ అస్కరి గుమ్మటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

ద్రాక్షారామ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కర్బలా మైదానంలో అసువులు బాసిన మహమ్మద్ ప్రవక్త కుటుంబీలకు నిర్వహించిన 68 రోజుల సంతాప దినాలు సోమవారంతో ముగిశాయి. 11వ ప్రవక్త ఇమాం హసన్ అస్కరి చివరిరోజుల సంతాపాన్ని సోమవారం ద్రాక్షారామ జరిపారు. మధ్యాహ్నం బార్‌మే ఇమాం పంజాలో మజిలిస్ అనంతరం పురుషులు, మహిళలు అస్కరి గుమ్మటాన్ని ఆగావారి పంజా వరకు తీసుకువచ్చి అక్కడ విదాయి మజిలిస్ ఇచ్చారు. విషాద గేయాలు ఆలపించారు. భక్తులు నిండుశోకంతో నివాళి అర్పించారు. మత గురువు మౌలానా మీర్జా అలీ హుస్సేన్ కార్యక్రమం గురించి వివరించారు. అనంతరం శుభ సూచకంగా పంజాలు, నివాసాలపై ఎర్ర జెండాలు ఎగుర వేశారు.

నిలకడగా గోదావరి

» జలదిగ్బంధంలోనే తోకలంక
» పరిశీలించిన తహశీల్దార్


రావులపాలెం గౌతమి వంతెన వద్ద ప్రవహిస్తున్న గోదావరి

రావులపాలెం/ఆలమూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదనీరు కొంత మేర తగ్గడంతో గోదావరి నిలకడగా ప్రవహిస్తోంది. రావులపాలెం మండలంలోని గౌతమి, వశిష్ఠ పాయలలో వరదనీరు పోటెత్తి ప్రవహించిన నేపథ్యంలో ముంపు బారినపడ్డ పంటపొలాలు నేటికి ఆ ముంపులోనే ఉన్నాయి. నదీ పరివాహక ప్రాంత పంటపొలాలు ముంపు బారిన పడడంతో పంటలు పాడైపోతాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఊబలంక శివారు తోకలంక జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో తహశీల్దారు బీఎం ముక్తేశ్వరరావు సిబ్బందితో వెళ్లి పరిశీలించి పలు సూచనలు చేశారు.ఆలమూరు మండలం చొప్పెల్ల లంక భూముల్లోకి వెళ్లే కాజ్‌వే, జొన్నాడ వద్ద పుష్కర్ ఘాట్ పూర్తిగా నీటిలో మునిగిపోయాయి.ఆలయాలు వరద నీటిలోనే ఉన్నాయి. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పంటలు వరద నీటిలోనే ఉన్నాయి. ఎగువ ప్రాంతంలో నిలకడగా వరద ప్రవాహం కొనసాగడంతో ఉధృతి పెరిగే అవకాశాలు తక్కువగా ఉన్నట్టు అధికారులు భావిస్తున్నారు.


ఆలమూరు: చొప్పెల్ల లంకలో నీటి మునిగిన కాజ్‌వే

విక్రమభట్టీశ్వర స్వామి ఆలయంలో పూజలు



ఆలమూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోనే ఏకైక ఆలయంగా ప్రసిద్ధి చెందిన ఆలమూరులోని పార్వతీ సమేత విక్రమభట్టీశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్వామి వారికి ఆలయ అర్చకులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించి అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సహకార బ్యాంకులను వినియోగించుకోండి

సబ్‌డివిజన్ అధికారి రాంబాబు


ఆలమూరు సొసైటీలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


ఆలమూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకింగ్ వ్యవస్థ పూర్తిస్థాయిలో కంప్యూటరైజేషన్ అయ్యిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సబ్‌డివిజన్ సహకార అధికారి డి.రాంబాబు సూచించారు. ఆలమూరు సొసైటీలో అధ్యక్షుడు వంటిపల్లి సతీష్‌కుమార్ అధ్యక్షతన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సహకార సభ్యుడిగా ఉన్న ప్రతీ రైతు ఖాతాను సంస్థ ఆన్‌లైన్ చేసిందన్నారు. వ్యవసాయ రంగ సేవలు మాత్రమే కాకుండా అన్ని రకాల సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు రామానుజుల ప్రకాష్, గూడాల నాగవెంకట్రావు, డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ ఐఎస్‌డీ ప్రసాద్, సూపర్‌వైజర్ వి.ప్రదీప్, సీఈవో బొబ్బా రామసుబ్రహ్మణ్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చింతలూరు సొసైటీ సీఈవో సస్పెన్షన్

మండలంలోని చింతలూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సీఈవో జి.నాగరాజును ఆరు నెలలపాటు సస్పెండ్ చేస్తూ పాలకవర్గం తీర్మానించినట్టు పాలకవర్గ అధ్యక్షుడు నల్లా వెంకన్న సోమవారం తెలిపారు. నిధుల దుర్వినియోగం ఆరోపణలపై గత ఏడాది కాలంలో పలు దఫాలు ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి నిధులు దుర్వినియోగం జరిగినట్టు నిర్ధారించారన్నారు. సొసైటీలో దాదాపు రూ.కోటి మేర నిధులు దుర్వినియోగమైనట్టు అమలాపురం డిప్యూటీ రిజిస్ట్రార్ నిర్ధారించి ఈ ఏడాది జూన్‌లో సీఈవో నాగరాజుపై చర్యలు తీసుకోవాలని సొసైటీకి నివేదిక పంపించారని. దానిపై పాలకవర్గం నిర్ణయం తీసుకునే విధంగా నివేదికలో ఉండడంతో సోమవారం పాలకవర్గం తీర్మాణించి ఆరునెలలు సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్టు వెంకన్న పేర్కొన్నారు.

నదీ గర్భంలోకి బొబ్బర్లంక

» నివాస గృహాలకు పొంచి ఉన్న ముప్పు
» భయాందోళనలో గ్రామస్థులు


బొబ్బర్లంక వద్ద కోతకు గురవుతున్న భూమి

ఆత్రేయపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గోదావరి వరదలకు వశిష్ఠ నదీ చెంతనే ఉన్న బొబ్బర్లంక గ్రామం కోతకు గురవుతోంది. ఇప్పటికే లంక పొలాలు నదీ గర్భంలో కలిసిపోతున్నాయి. కాటన్ బ్యారేజీ చెంతనే ఉన్న బొబ్బర్లంక గ్రామంలోని వశిష్ఠ నదీపాయ వెంబడి సుమారు 200 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. గోదావరికి వరద పోటెత్తడంతో కోతకు గురై నదీ గర్భంలో కలిసి పోతోంది. ఈ నేపథ్యంలో గోదావరి వరదలు సంభవించినప్పుడల్లా కోతకు గురవ్వడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నివాస గృహాలు చెంతనే నదీ గర్భం కోతకు గురవ్వడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం గ్రోయిన్స్ నిర్మాణం చేపట్టి నదీ కోత నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఘనంగా గణపతి నిమజ్జనాలు


దేవరపల్లిలో గణపతిని ఊరేగిస్తున్న భక్తులు

రావులపాలెం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక మండపాలలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలకు ఆయా ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు నిమజ్జన కార్యక్రమాలు చేపట్టారు. రావులపాలెం మండల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణపతి వినాయక విగ్రహాలను భారీ ఊరేగింపు నడుమ భక్తులు నిమజ్జన కార్యక్రమానికి తరలించారు.

దేశంలో అత్యధికంగా ఏపీలోనే పింఛన్లు

మంత్రి సుభాష్


వెల్లలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్

ద్రాక్షారామ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లోనే సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టు మంత్రి సుభాష్ అన్నారు. సోమవారం రామచంద్రపురం మండలం వెల్ల, జల్లిపేట, కమ్మవారి సావరం, ముచ్చుమిల్లి గ్రామాల్లో ఎన్టీఆర్ సామాజిక పింఛన్లు మంత్రి సుభాష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 62.95 లక్షల మందికి రూ.32,520 కోట్లు పింఛన్లకు వెచ్చిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, వెల్ల సర్పంచ్ సూరిబాబు, ఆకుల నారాయణరావు, వెల్ల సోమేశ్వర, వేణుగోపాలస్వామి దేవస్థానం చైర్మన్ అన్యం జానకిరామయ్య, కొమ్మిరెడ్డి కోదండరాముడు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం..

రామచంద్రపురం మండలం చోడవరం-కాకినాడ రోడ్డులో జుత్తుక యేసుదాసు మినిస్ట్రీస్ చారిటబుల్ ట్రస్టు నిర్మించిన బస్ షెల్టర్‌ను మంత్రి సుభాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకుడు పీటర్ వరప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ మండలాధ్యక్షుడు కొత్తపల్లి శ్రీను, బిక్కిన జగన్నాథరావు, నూనె లక్ష్మణరావు, జె.మహాలక్ష్మి పాల్గొన్నారు.

పింఛన్లతో పేదలకు భరోసా

ఎమ్మెల్యే బండారు


కండ్రిగలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా 1వ తేదీన ఇంటి వద్దకే పింఛన్లు పంపిణీ చేస్తుడడంతో పేదలకు భరోసా ఏర్పడిందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం మండల పరిధి కండ్రిగలో పింఛన్ల పం పిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

పేదరికం నిర్మూలనకు పీ4

ఇదిలా ఉండగా పీ4 కార్యక్రమం లో భాగంగా మండల పరిధి కండ్రిగలో చిర్రా సత్యనారాయణమ్మ, చి ర్రా స్వామి కుటుంబాలను ఎమ్మెల్యే సత్యానందరావు దత్తత తీసుకున్నారు. వారికి పక్కా ఇళ్లు నిర్మించడంతో పాటు ప్రతి నెలా రూ.3 వేలు ఆర్థిక సా యంగా అందించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పే దరికాన్ని పాలద్రోలడానికే సీఎం చంద్రబాబు ఆలోచన నుంచి వచ్చిన కార్యక్రమం పీ4 అని, అది విజయవంతమయ్యేలా కూటమి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలన్నారు.

ఆర్చరీలో కృష్ణకు సిల్వర్ మెడల్

ఆత్రేయపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకంపాలెం గ్రామానికి చెందిన కుడప వీరవెంకట కార్తీకేయ కృష్ణ విలు విద్య పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఫ్యూచర్ కిడ్స్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న కృష్ణ కేరళ రాష్ట్రంలోని కొత్త మంగళం ఇంటర్నేషనల్ స్కూల్లో ఆగస్టు 28 నుంచి 30వ తేదీ వరకూ జరిగిన ఆల్‌ఇండియా ఐసీఎస్‌టీఈ స్కూల్ అండర్-19 కాంపౌండ్ మెన్ విభాగంలో కార్తీకేయ కృష్ణ సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం



ఆత్రేయపురం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి తణుకుకు చెందిన లలితాంబిక ఫార్మాటిక్స్ సర్వీసు అధినేత ఒబిలిశెట్టి రవిచంద్ర బాలబాలాజీ- లీలా వెంకట సత్యవాణి దంపతులు రూ.లక్ష విరాళాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్య చక్రధరరావు దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు.